తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక

# హాస్యానందం


సంపూర్ణ హాస్య మాస పత్రిక

ఆగష్టు-2022

వెల: రూ.20



విఘ్నాలే తొలగాలని, విజయాలే కలగాలని.
నవ్వుల నాయకుని విన్నవించుకుందాం!
హాస్యానందంగా ఉందాం!



**బాచి అవార్డు-2022**
**కార్టూన్ పోటీ ఫలితాలు**

**సోమయాజులశివరామయ్య,**
**హైమవతి స్మారక కార్టూన్ పోటీ ఫలితాలు**


**అన్నెపు సన్యాసిరావు స్మారక**
**కార్టూన్ పోటీ ఫలితాలు**

**నవ్వుల 'బుల్లెట్' తో**
**'ఆనందో బ్రహ్మ' యండమూరి**



హాస్య ప్రియులందరికీ
వినాయక చవితి శుభాకాంక్షలు

చవకబారు వస్తువులు విలువైనవి కావు...
విలువైన వస్తువులు చవకగా ఉండవు!!



**Jaquar**

**Sambamurty Enterprises**
12-10-04, Convent Street, Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548

నవ్వు
నవ వసంతం!


తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యమాస పత్రిక

# హాస్యానందం

**ఆగష్టు-2022**

**20వ సంవత్సరం**

**218 వ సంచిక**


*Publisher& Editor-*
*Ramu.P*

*Full Pillar* :
Bnim

*Cartoon Feature Editor*:
Bachi

*D.T.P:*
P. Ramalakshmi, 9440304993

*Digital Media Director:*
Surya

*Well Wishers:*
Dr.K.V.Ramanachary, *(I.A.S.Retd)*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Dr.V.V.Rama Kumar
Gudibandi Venkata Reddy



ముఖచిత్రం:
ఆశికా రంగనాథ్

*Prize Sponsers*
K.V.V.Satyanarayana,
VisweswaraRao
*Cartonist* JSR
K.Sundaresayya&
Satyavathi
J.Nageswara Rao

*Creative Team*
Dayakar
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar
Krishna
GopalKrishna
Venkat
Ramsheshu
Sangram
Nagisetty
Bomman
Muralidhar


**సంవత్సర చందా-రూ.300/-**
(పోస్టల్ చార్జీలతో)

**2 సంవత్సరాల చందా-రూ.500/-**
(పోస్టల్ చార్జీలతో)

**జీవిత చందా- రూ.5000/-లు**



Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
***Ph* : 9849630637**

email:
**hasyanandam.mag@gmail.com**
web:
**www. hasyanandam.com**



**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad.
Cell. 9666680857.



**గమనిక:**
ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది మా అభిమతం కాదు. ఈ పత్రికలో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.


Smile in Every Page...Satisfaction in Every Smile

# ఎక్కడెక్కడ ఏమేమున్నాయి?...

## కథలు...


| | | |
|---|---|---|
| పో.రా! | -కె.వి.భవాని | -12 |
| యువరానర్! ఆడవాళ్ళు అమాయకులు! | -నల్లబాటి రాఘవేంద్రరావు | -16 |
| నేములో నేముంది? | -బుద్ధవరపు కామేశ్వరరావు | -32 |
| (వి)చిత్ర విమర్శకుడు | -కంచనపల్లి ద్వారకనాథ్ | -36 |
| సండే స్కీం | -డాక్టర్ పార్థసారథి చిరువోలు | -40 |


## శీర్షికలు


| | | |
|---|---|---|
| 'పన్'చదార చిలుకలు | -శంకరనారాయణ | -7 |
| ఈనెల ప్రోత్సాహక బహుమతులు | | -8 |
| నవ్వులాట | -గాంధీ మనోహర్ | -10 |
| జోక్స్ జోన్ | -ఎన్.ఆర్.కె.ఎస్.వి.మూర్తి | -21 |
| నవ్వించే రాగాలు | -ఎన్.పి.ఎస్.రావు, విట్టుబాబు | -22 |
| తర్కారావు కథలు | -గంగాధర్ వడ్లమన్నాటి | -25 |
| ఫన్‌పంచ్ | -గుండు సుదర్శన్ | -26 |
| కొత్త పుస్తకాలు | | -31 |


## సీరియల్



| | | |
|---|---|---|
| ఇందు చందు-నవ్వులవిందు | -కండ్లకుంట శరత్‌చంద్ర | -44 |


## కార్టూన్ శీర్షికలు


| | | |
|---|---|---|
| గీతలో సామెత | -డా॥ పూతేటి | -4 |
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -18 |
| స్పోర్టీవ్ | -బాచి | -19 |
| మోకన్న | -ప్రేమ్ | -20 |
| నెలనెలా నవ్వుల వెన్నెల | | -38 |
| నవ్వే ఆనందం | -గోపాలకృష్ణ | -41 |
| నవ్వేమందు | -ప్రసిద్ధ | -43 |
| ఏడు వారాల నగలు | -అరుణ్ | -46 |


## గీతలో సామెత

Dr. Putheti






## ఈ నెల ప్రత్యేకతలు


బాపు బొమ్మల కొలువు @60 — 14

బాచి అవార్డు -2022 కార్టూన్ పోటీ ఫలితాలు — 23

వానొచ్చే... వరదొచ్చే... — 28

శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక కార్టూన్ల పోటీ ఫలితాలు — 29

శ్రీ అన్నెపు సన్యాసిరావు స్మారక కార్టూన్ పోటీ ఫలితాలు — 34

స్ఫూర్తి దాయకం పండరి జీవితం — 48

కిరికెట్ — 49


## ఈ సంచికలో కార్టూనిస్టులు

- రామకృష్ణ
- సరసి
- గాంధీ
- డా॥ పూతేటి
- బాచి
- గోపాలకృష్ణ
- ప్రసిద్ధ
- పద్మ
- ఎన్.పి.ఎస్.రావు
- సునీల్
- శర్మ
- బొమ్మన్
- రామ్‌శేషు
- నాగిశెట్టి, ఎన్.ధీరజ
- ప్రేమ్
- తోపల్లి ఆనంద్
- డి.శంకర్
- వందన శ్రీనివాస్
- కృష్ణ
- రవిశర్మ
- దొరశ్రీ
- శ్రీహంసిక
- పెండేల
- స్వాతికృష్ణ
- చక్రవర్తి
- అత్తలూరి
- ఎమ్.రాము
- పుష్ప
- టి.ఆర్.బాబు
- శంబంగి
- ప్రసాద్ కాజ
- భాను
- అరుణ్
- వినోద్
- వనజ
- శేఖర్
- పరమేశ్వర్
- బొబ్బిలి
- సీతారామ్
- ఉత్తమ్
- గౌతమ్
- వరప్రసాద్
- రంగాచారి
- ఎమ్.ఎ.రవూఫ్
- శేఖర్‌బాబు
- సురేంద్ర

## హాయ్...సానందంగా...



**హాస్యానందం అభిమానులకు...**
**ఆప్తులకు... హాస్యప్రియులకు,**
**సన్నిహితులకు వినాయక చవితి శుభాకాంక్షలు!**

**భార్యాభర్తలు...** బాధ్యతలకు మొదటి మెట్టు!

'ఈ' ఇద్దరు వ్యక్తుల ప్రవర్తన కుటుంబాన్ని, సమాజాన్ని ఎంతో ప్రభావితం చేస్తుంది. భార్యాభర్తలు ఆరోగ్యకరమైన సమాజానికి మూలస్తంభాలు. తదుపరి మజిలీలో 'తల్లిదండ్రులు'గా పిల్లల ఆరోగ్యకరమైన ఆలోచనలకు ఆధారం వీరే! వీరి ప్రవర్తన... నడవడిక... రాబోయే తరాలకి పునాది అన్నది వాస్తవం! నిర్లక్ష్యం, అహంకారం, బాధ్యతారాహిత్యం... పిల్లలకు మార్గదర్శకం కాకుండా చేయడం ప్రతి తల్లిదండ్రుల...అదే భార్యాభర్తల బాధ్యత! సమాజం పట్ల బాధ్యత, ఇంట్లో మెలగవలసిన తీరు,ఎదుటివాళ్ళను గౌరవించే పద్ధతి... ఇవన్నీ భార్యాభర్తలైన తల్లిదండ్రులు పిల్లలకి అందించాల్సిన ప్రాథమిక ఆస్తులు! ప్రస్తుతం తల్లిదండ్రులు, తాము పడ్డ కష్టాలు తమ పిల్లలకు కలుగకూడదని చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే కష్టం విలువ తెలియజేస్తేనే జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను ఎదుర్కోగలిగే స్థైర్యం ఏర్పడుతుంది.

పిల్లలకు మొదటిబడి- అమ్మ ఒడి!... ఆ లేత మనసులు 'మనం' ఎలా ప్రవర్తిస్తే... వాళ్ళు అదే అనుసరిస్తారు...మంచైనా చెడైనా! వేసే అడుగులు తప్పడడుగులు కాకుండా నడిపించే బాధ్యత తండ్రిపై ఎప్పుడూ ఉంటుంది. మనం ఎన్నో పనులు బాధ్యతాయుతంగా చేస్తుంటాం... ఆ బాధ్యతల్లో పెద్ద బాధ్యత రాబోయే తరాన్ని ఆరోగ్యకరమైన ఆలోచనలతో పెంచడమే! పిల్లలతో పాటు వారిలో సహృదయతని పెంచితే... మంచి చేయడానికి స్పందించే లక్షణాలు అలవడి... ఆరోగ్యకరమైన సమాజానికి పునాదులు అవుతారు...

అందరూ హాయిగా... ఆనందంగా...

ఆరోగ్యంగా... ఉండాలని కోరుకుంటూ.....





✦ ప్రసిద్ధ, కార్టూనిస్టు, హైదరాబాద్

**జూలై**'22 సంచికలోని రాము గారి ఎడిటోరియల్ నిజంగా ఒక మాస్టర్ పీస్. కష్టాలు కలకాలం ఉండవు, కాలం ఎలాంటి గాయాన్నైనా మాన్పుతుంది, ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుంది, కష్టాల్లో ఉన్నవాడికి ఆత్మీయుల సాంత్వన చేకూర్చే మాటలు ఉపశమనం కలిగిస్తాయి... సమస్య వస్తే కావల్సింది మొదటిగా సహనం, గుండె ధైర్యం, యధావిధిగా పనులు వాయిదా వేయకుండా ఉండాలని 21 వాక్యాలలో రాముగారు జీవిత సత్యాలు చెప్పారు. ఇదొక చక్కటి మోటి వేషన్ పాఠం. నాకే కాదు ఎంతో మందికి ఈ సంపాదకుని పలుకులు గుండెకు హత్తుకున్నాయి.




ముళ్లపూడి సింగిల్ పేజీ కథలతో పాటు మిగతా అన్ని కథలు బాగు న్నాయి. చివుకుల పద్మజ గారి 'ఎక్కడమ్మా కోడలా' కథలోని సంఘటనలు పెళ్లికాని ప్రసాదుల తల్లితండ్రులకు అనుభవైకవేద్యమే. బాగా రాసారు.



✦ నాగిశెట్టి, విజయవాడ

**థాం**క్యూ వెరీ మచ్ డియర్ సుదర్శనం గారూ! ఈ నెల హాస్యా నందంలో నా ప్రశ్నలకి అదిరే సమాధానాలిచ్చినందుకు. కొంచెం డిఫరెంట్‌గా ఉండాలని, ప్రశ్నలు ఫ్రేమ్ చేయడానికి చాలా జాగ్ర త్తలు తీసుకున్నాను. మరోసారి థాంక్యూ సర్.

✦ ఆర్.కిరణ్మయి, బెంగళూరు

**న**వ్వుకు కారణం ఆనందం! సూపర్... ఆనందం కోసం మీరు చేస్తున్న కృషి అభినందనీయం. మా కుటుంబం మొత్తానికి అభిమాన పత్రిక హాస్యానందం!

గుండెల్లో మండె అగ్నిగోళపు మంటల్ని
హాస్యపు గుళికలతో చల్లార్చే హాస్యానందం....
మనసుల్లోని మబ్బులు కమ్మిన మసకల్ని
లాస్యపు గుళికలతో మటుమాయం చేసే లాస్యానందం....
బ్రతుకుల్లోని చిక్కని పీటముళ్ళను
చతురతతో చక్కబెట్టే నారదానందం....
తప్పుడు నడకల పద్దులు కట్టి
చిత్రగుప్తుని చిట్టాకెక్కించిన విచిత్రానందం....
మరలకే కాదు...మనుషులకూ
మరమ్మతులంటూ గుండు గురి పెట్టిన సుదర్శనానందం....!!!

**-రాజశ్రీ రెడ్డి, సినీ, టీవీ నటి, కవయిత్రి**

## చిరునవ్వుల ఆనందం-హాస్యానందం

ఉరుకుల పరుగుల జీవితాలకి సేద తీర్చే నందనవనం
హాస్యానందం
మనసుకు ఉల్లాసాన్ని కలిగించే అమృతవనం
హాస్యానందం
అలసిన శరీరాలకు చల్లటి తేనీరు హాస్యానందం
విసుగును తరిమివేసే కమ్మని జలతారు హాస్యానందం,
నిరాశ నిస్పృహలకు దూరంచేసే సంజీవని హాస్యానందం
ఒత్తిడి నివారణకు దివ్యౌషధం హాస్యానందం
బాధలను మరచిపోయేలా చేసి...
నవ్వుకునేలా చేసేది హాస్యానందం
ఒంటరి మనుషులకు నేనున్నానంటూ...
తోడుండేది హాస్యానందం
గిలిగింతల కార్టూన్లతో చక్కిలిగింతలు పెట్టేది హాస్యానందం
పొట్ట చెక్కలయ్యేలా నవ్వించేది హాస్యానందం
రసానుభూతుల రమణీయం హాస్యానందం
రోజు కాసేపు నవ్వుకోవడానికి ఉండాలి హాస్యానందం,
పాఠకుల మదిని దోచే హాస్యానందం
హాస్యప్రియులకు దొరికిన ఆణిముత్యం హాస్యానందం.
హాస్యానందానికి లేదు సాటి
హాస్యానందమే అన్నిటికన్నా మేటి

**-నిమ్మగడ్డ కృష్ణ**




గత 20 ఏళ్ళుగా
ఇంటిల్లిపాదినీ
నవ్వించే పని పెట్టుకున్న
ఏకైక తెలుగు హాస్య
మాస పత్రిక- హాస్యానందం

**5000 రూపాయలు చెల్లించి**
**జీవిత చందాదారులుగా చేరండి!**

✦ ప్రతి నెలా పత్రికని రిజిష్టర్ పోస్ట్‌లో పొందండి!
✦ సంవత్సరానికి ఒక నెలలో ఒక ప్రకటన ఉచితం!


వివరాలకు 9849630637 కు ఫోన్ చేయండి!



# 'ఫన్'చదార చిలుకలు

'హాస్యబ్రహ్మ' డా॥ శంకరనారాయణ

Cartoons: Ramseshu




ప్రాచీన సాహిత్యం అంతా
తాటాకు చప్పుళ్ళే!



తీపి కలలు వస్తాయని
భయపడేవాడు
అసలు సిసలైన
'షుగర్ పేషెంట్'!



నేడు 'పిల్లా' అంటాడు...
రేపు' కల్లా' అంటాడు...
ఇది వయో వేదాంతం!



అగ్రి కల్చర్‌లోనూ...
అగ్ని కల్చర్‌లోనూ
'మడి' తప్పదు!



సన్మానాలు
ఎక్కువైతే
వచ్చేది
'దండ'కావరం



'సెల్లు ప్రకృతి!
'సొల్లు' వికృతి



జనం లేకపోతే
నేను లేనంటుంది
భోజనం!



పెర్ఫ్యూమ్ వాసన
'సెంట్' పర్సెంట్




'గురువులు' కనిపిస్తున్నది
ఛందస్సుల్లోనే!



స్త్రీ పట్టుదలను
పెంచేది
'పట్టు'చీర!





'పాలు' పోని
పరిస్థితి వస్తే
డెయిరీలకు
ఎంత కష్టం!



యూజ్ ఎండ్ త్రో
'వేస్ట్'రన్
కల్చర్!



ఇల్లారికం
అల్లుడు
అత్తగారింట్లో
'అల్లు'కు పోయేవాడు



బీరువాలో నోట్ల కట్టలు ఉంటే
'షెల్ఫ్' కాన్ఫిడెన్స్!

## ఈ నెల ప్రోత్సాహక బహుమతులు



మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **కార్టూన్ ఇష్టులు శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు** ప్రతి నెలా హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి **ఒక మంచి కార్టూన్‌కి రూ.1000/-లు** బహుమతిగా ఇస్తున్నారు.




**ప్రముఖ చిత్రకారులు శ్రీ జె.నాగేశ్వరరావు గారు** ప్రతి నెలా హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి **ఒక మంచి కార్టూన్‌కి రూ.500/-లు** బహుమతిగా ఇస్తున్నారు.









కార్టూన్‌ని ప్రాణంగా ప్రేమించిన **శ్రీమతి వాగ్దేవి జ్ఞాపకార్థం** కార్టూన్ కళని ఆరాధిస్తున్న కార్టూనిస్ట్‌లకు **వాగ్దేవి పురస్కారం-** ప్రతినెలా ఒక కార్టూనిస్ట్‌కి **1000 రూపాయలు & ప్రశంసాపత్రం** **శ్రీ వాగ్దేవి విశ్వేశ్వరరావు గారు** అందజేస్తున్నారు.

**ఈ నెల పురస్కార గ్రహీత -ప్రసిద్ధ**







**కార్టూనిస్ట్ శ్రీ జె.ఎస్.ఆర్.**
(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలని
హాస్యానందంకు వచ్చిన కార్టూన్లోంచి
**ఒక మంచి కార్టూన్‌కి**
**ప్రతినెలా 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







కార్టూనిస్టులపై ప్రేమతో, వాత్సల్యంతో
**శ్రీకుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు** (కోవూరు)
కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే
సదుద్దేశంతో హాస్యానందంకు వచ్చిన
కార్టూన్లోంచి ఒక మంచి కార్టూన్‌కి
**ప్రతినెలా 500 రూపాయలు**
**బహుమతిగా ఇస్తున్నారు.**






రామకృష్ణ ఫౌండేషన్
సమర్పించు కార్టూన్



# నవ్వులాట

గాంధీ మనోహర్, 98490 51846

## కేరాఫ్ దరిద్రం !

**ఆ** మాట వినగానే కొండబాబుకు కళ్ళు బైర్లు కమ్మాయి.

✦✦✦

కొండబాబు, గిరి బెస్ట్ ఫ్రెండ్స్ పైగా ఐదేళ్ళుగా రూమ్ మీట్స్. కొన్ని కారణాల వల్ల ఇప్పుడు అద్దెకున్న ఇల్లు ఖాళీ చేసి... వేరేది చూసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

వారం రోజులుగా ఇద్దరూ నాన్ స్టాప్‌గా తిరిగినా ఎక్కడా వాళ్లకు నచ్చిన ఇల్లు దొరకలేదు. నచ్చిన ఇల్లు దొరికినా... దాన్ని బ్యాచ్లర్స్‌కు ఇవ్వమని అంటున్నారు.

అంచేత ఇక తమకి నచ్చకపోయినా ఏదో ఒక ఇంట్లో జాయిన్ అయిపోదామని డిసైడ్ చేసుకున్నారు.

ఆరోజు గిరీకి ఆఫీస్ పని ఉండడంతో కొండబాబు ఒక్కడే అద్దింటి కోసం వెతుకుతూ వున్నాడు.

కొండబాబుకి ఒకచోట టులెట్ బోర్డ్ కనిపించింది... అది మంచి ఏరియా కాకున్నా తీసేసుకుందామని డిసైడ్ అయిపోయి, బోర్డ్‌పై రాసున్న ఫోన్ నంబర్‌కి డయిల్ చేశాడు... ఎంగేజ్ వచ్చింది.


ఎవరైనా ఈ ఇంటి గురించే ఓనర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్నారేమోనని చిన్నపాటి టెన్షన్ పడ్డాడు కొండబాబు.

ఇంతలో ఆ టులెట్ ఇంట్లో నుండి ఓ వ్యక్తి చిరాకుగా ఫోన్ మాట్లాడుతూ వచ్చి కట్ చేసి, అక్కడే వున్న కొండబాబుతో– "మీరు ఈ అద్దిల్లు చూడటానికి వచ్చారా?" అడిగాడు.

ఔను అన్నట్టు తలాడించాడు కొండబాబు.

దాంతో అతను ఆవేశంగా– "వెళ్లి చూద్దం వేస్టు... అది సింగిల్ బెడ్ రూమ్! బాత్ రూమ్ చాలా చిన్నది... ఇల్లంతా చీకటిగా వుంది... దానికి తోడు నెలకు అద్దె 15 వేలుతో పాటు ఐదు నెలల అడ్వాన్స్ అడుగుతున్నాడు దరిద్రుడు. దీని బదులు ఫుట్‌పాత్ మీద వుండడం బెటర్." అని వెళ్ళిపోయాడు ఆ వ్యక్తి.

కొండబాబు కూడా అక్కడి నుండి వెళ్లిపోబోతుంటే...




ఇంతలో ఆ టులెట్ శాల్తి కాల్ బ్యాక్ చేసి–

"లోపలికి వెళ్ళండి... మా అమ్మాయి వుంటుంది... మీకు ఇల్లు చూపిస్తుంది... చూశాక నచ్చితే... నాకు కాల్ చేయండి. మిగతా విషయాలు మాట్లాడదాం" అని కాల్ కట్ చేశాడు ఇంటి ఓనర్.

ఓనర్ మాట్లాడిన మాటల్లో...''మా అమ్మాయి...' అనే మాట కొండబాబుని వెనక్కి వెళ్ళిపోయే ఆలోచనని కిల్ చేసి లోపలికి నడిచేట్టు మోటివేట్ చేసింది.

కొండబాబు లోపలికి వెళ్తూ జేబులో వున్న దువ్వెన్న తీసుకుని తల దువ్వుకుని, మొహానికి పట్టిన చెమటను కర్చీఫ్‌తో తుడుచుకున్నాడు.

ఓనర్ గారి అమ్మాయి హీరోయిన్ అలియా భట్ కు డూప్ లా వుంది. దాంతో కొండబాబు స్పెల్ బౌండ్ అయిపోయాడు.

ఇన్నాళ్ళకి తన అదృష్టం మీద కొండబాబుకి నమ్మకం,గౌరవం ఏర్పడింది.

ఓనర్ గారి అమ్మాయి ఇల్లు చూపిస్తోందే గానీ కొండబాబు మాత్రం ఇంటిని చూడకుండా ఆ అమ్మాయినే చూస్తున్నాడు.

ఇల్లు చూశాక ఓనర్ కు ఫోన్ చేసి– 'మీ అమ్మాయి నచ్చింది' అని అనబోయి... "ఇల్లు నచ్చింది! రెంట్ ఎంత?" అని అడిగాడు.

15వేలు రెంట్, 5నెలల అడ్వాన్స్! రూమ్‌లో ఇద్దరికంటే ఎక్కువమంది వుండకూడదు... నీళ్ళు ఎక్కువ వాడకూడదు.రాత్రి పూట తొందరగా వచ్చేయాలి... ఇలా ఏవేవో కండీషన్స్ చెప్పాడు.

అన్నింటికీ డబుల్ ఓకే... అన్నాడు కొండబాబు.

తనతో పాటు గిరి వుంటే ఓనర్ గారి అమ్మాయి లవ్వు విషయంలో కాంపిటీషన్ ఉంటాడన్న డౌట్‌తో– "రేయ్! ఓ ఇల్లు చూశాను... కానీ అందులో ఒకరే వుండాలని ఓనర్ అన్నాడు... నేను ఒకే అన్నాను!" అని అల్టిమేట్ అబద్ధం గిరీతో చెప్పాడు కొండబాబు.

నిజమని నమ్మిన గిరి– "నో ప్రాబ్లం రా!... నేను మా బాబాయి వాళ్ళ ఇంట్లో వుంటాను. వాళ్ళు కూడా నన్ను వచ్చి వాళ్ళ ఇంట్లో ఉండమని రోజూ నాకు ఫోన్ చేస్తున్నారు" అని అన్నాడు.

'అమ్మయ్య కాంపిటీషన్ పోయింది' అని మనసులో అనుకుని కొండబాబు లోలోన హ్యాపీగా ఫీల్ అయ్యాడు.

ఐదు రూపాయల వడ్డీకి లక్షరూపాయలు అప్పు తెచ్చుకుని, ఓనర్ కి ఐదు నెలల అడ్వాన్స్ ఇచ్చి మిగతా డబ్బుతో తనకి బ్రాండెడ్ బట్టలు కొన్నాడు.

మరుసటి రోజు మంచిదినం కావడంతో లగేజీతో అద్దింటికి షిఫ్ట్ అయిపోయాడు కొండబాబు.

చేరిన మొదటి రోజే ఓనర్ గారి అమ్మాయి పేరు చంపకమాల అని తెల్సుకోడమే కాకుండా తనతో మాట్లాడాడు. చంపకమాల కూడా నవ్వుతూ కొండబాబుతో మాట్లాడింది. భవిష్యత్తులో చంపకమాల కూడా కొండబాబుని ప్రేమించిన పిదప తనని చంపక్ అని ముద్దుగా పిలవాలని నిర్ణయించుకున్నాడు.

మొదటి రోజే ఇంత ఆహ్లాదంగా గడిచినందుకు తన ఇష్ట దైవం దేరాబాబాకి దణ్ణం పెట్టుకుని నలభై రూపాయల కొబ్బరి కాయ కొట్టాడు.

రాత్రి తనకి ఇష్టమైన లవ్ పాటలు వింటూ నిద్ర పోయాడు.

పొద్దున్నే ఓనర్ ఇంట్లో సందడిగా వుంటే ఏం జరుగుతుందో అని వెళ్లి చూశాడు.

బయట క్యాబ్ ఆగి వుంది. అందులో పెద్ద పెద్ద సూట్ కేసులు పెడుతున్నారు. ఇంతలో చంపకమాల హడావుడిగా క్యాబ్ ఎక్కి తన పేరంట్స్‌కి బాయ్ చెప్పి వెళ్ళిపోయింది.

చంపకమాల ఎక్కడి వెళ్లిందో కొండబాబుకి అర్థం కాలేదు.

దాని గురించే ఆలోచిస్తూ ఉండగా... ఇంతలో కొండబాబు దగ్గరకు ఇంటి ఓనర్ వచ్చి– "మా అమ్మాయి రష్యాలో మెడిసన్ చదువుతోంది బాబు... కరోనా పుణ్యమాని ఆరు నెలలు ఇక్కడే వుంది. ఇప్పుడు వెళ్తే మళ్ళీ రెండేళ్ళ వరకు రాదు. అని అన్నాడు.

ఆ మాట వినగానే కొండబాబుకు కళ్ళు బైర్లు కమ్మాయి.

"మా చంపకమాల వెళ్ళిపోయినందుకు చాలా బాధగా వుంది. ఇప్పుడు మందు కొడితే గానీ నాకు మనశ్శాంతి వుండదు." అని జేబులో నుండి మందు బాటిల్ తీసి...

"నువ్వు ఏమీ అనుకోకపోతే నీ ఇంట్లో నేను మందు కొట్టచ్చా? మా ఇంట్లో తాగితే మా ఆవిడ నన్ను కొట్టి గొడవ చేస్తుంది!" అని కొండబాబుతో ఇంటి ఓనర్ అన్నాడు.

పాపం కొండబాబు 'యస్' అని గానీ... 'నో' అని గానీ... చెప్పే స్థితిలో లేదు.

5 రూపాయల వడ్డీకి తెచ్చిన లక్షరూపాయలు గుర్తుకు రావ దంతో ఒక్కసారిగా బాడీలో బ్యాలెన్స్ తప్పి కింద కూలబడ్డాడు కొండబాబు.

ఇంటి ఓనర్ ఇదేమి పట్టించుకోకుండా కొండబాబు ఇంట్లో కూర్చోని మందుకొడుతున్నాడు.

## శ్రీ గుదిబండి వెంకట రెడ్డిగారు నిర్వహించిన మినీ కథల పోటీలో గెలుపొందిన కథలు

**ఫిర్ అంటే తుర్**
-వసుంధర, హైదరాబాద్

**ఇరుగూ పొరుగూ అన్నాక....**
-కోనే నాగ వెంకట ఆంజనేయులు, విశాఖపట్టణం

**అతిథి దేవుళ్ళు**
-సింహప్రసాద్, యు.ఎస్.ఎ

**గుండెల్లో గులకరాయి**
-గంటి ఉషాబాల, వరంగల్

**లావొక్కింతయు లేదు**
-ఓట్ర ప్రకాష్ రావు,తిరుత్తణి

**ఎగిరిపోతే ఎంత బాగుంటుంది**
-పద్మావతి తల్లోజు, మహబూబ్‌నగర్

**'పాళీ పదకేళీ విన్యాసం'**
-తెలికిచెర్ల విజయలక్ష్మి, హైదరాబాద్

**భలే మంచి చౌక బేరమూ**
-కోటమర్తి రాధా హిమబిందు, హైదరాబాద్

**గొలుసు ధూమపానం**
-గంగాధర్ వడ్లమన్నాటి, విశాఖపట్టణం

**పక్కింటావిడ**
-కట్టా రాంబాబు, విజయవాడ

న్యాయనిర్ణేత: **డా॥ రావెళ్ళ**

**బహుమతి పొందిన కథలు సెప్టెంబర్ హాస్యానందంలో ప్రచురించబడుతుంది.**

## ఆహ్వానము

### బహుమతి ప్రదానోత్సవ సభ

తేది: **18-09-2022. ఉదయం10గంటలకు**

వేదిక: శ్రీకె.వి.రమణాచారిగారి క్యాంపుకార్యాలయం, ఎ.సి.గార్డ్స్, ఇన్‌కం టాక్స్ టవర్ దగ్గర, మసాబ్‌టాంక్, హైదరాబాద్.

మరిన్ని వివరాలు సెప్టెంబర్ సంచికలో...

# పో.రా!

కె.వి.భవాని,
9573255930

**ప్రతి రోజూలానే ఆ రోజు కూడా అలారం మోతతో నిద్ర లేచాడు ఆనందరావు.**

**లేవగానే టైం చూసాడు... పిచ్చికాకపోతే తను పెట్టిన టైంకే అలారం మోగింది కదా... మళ్ళీ ఈ టెస్టింగేమిటో!**

**టైం అయిదయింది.**

**పక్కనే ఉన్న ఫోన్ అదేనండీ... సెల్‌ఫోన్‌ని అపురూపంగా అప్పుడే దొరికినట్లు చేతుల్లోకి తీసుకున్నాడు ఆనందరావు.**

ముందుగా వాట్సాప్‌ల్లో మెసేజ్‌లన్నీ ఓపెన్ చేసి... చూసి, చదివి... తరువాత తను ఏక్టివ్ మెంబర్‌గా ఉన్న 14 గ్రూప్‌ల్లో 'గుడ్ మార్నింగ్' మెసేజ్ పెట్టాడు.

పక్కకి తిరిగి చూశాడు. తన సహధర్మచారిణి ప్రశాంతంగా నిద్ర పోతున్నది.

మళ్ళీ తన దృష్టి ఫోన్ పైకి మరల్చి ఫేస్‌బుక్ ఓపెన్ చేశాడు.

అందులో కూడా 'ఏవేవో' చూశాడు...చేశాడు.

ఫోన్ చేతిలో పట్టుకుని ముడుచుకుని కూర్చున్నాడు కాబట్టి నాకు అతను ఏం చేశాడో కనబడలేదు. అందుకే అతనేం చేశాడో చెప్పలేక పోతున్నాను క్షమించండి!

గంటసేపట్నుంచి బిజీబిజీగా ఉన్న ఆనందరావు– 'ఏమండీ!' అన్న పిలుపుతో ఉలిక్కి పడ్డాడు.

ఎప్పుడు లేచిందో ఆ మహాతల్లి చేతిలో కాఫీ కప్పుతో నిలబడి ఉంది.

ఒక్క క్షణం పక్కకి చూసాడు.

పక్కమీద పక్కన లేదు శ్రీమతి. ఎప్పుడు లేచిందో కూడా గమనించ లేని ఏకాగ్రతతో చరవాణిని గమనిస్తున్నాడు ది గ్రేట్ ఆనందరావు.

తన దినచర్య ప్రతిరోజు ఇంచుమించు కాదు...కాదు... ఇలానే మొదలౌతుంది.

ఆనందరావు వాట్సాప్, ఫేస్బుక్‌ల్లో నిత్యం మునిగి, తేలుతూ ప్రపంచంలో నలుమూలల ఎక్కడ ఏం జరిగినా... వాట్సాప్‌ల్లో తనకి వచ్చిన మెసేజ్‌లు ఎదుటి వాళ్ళకు అవసరమైనవి అనవసరమైనవి పం(పు)చుతూ... పేరు ప్రఖ్యాతులు(?) సంపాదించుకున్నాడు.


ఎవరికీ ఏ అనుమానం వచ్చినా 'ఏవండి ఏం జరిగింది?... ఇది నిజమేనా?...' అని మెసేజ్ పెడితే... క్షణంలో దానికి రిప్లై ఇచ్చేస్తాడు ఆనందరావు.

రిటైరయిన తరువాత గొప్ప వ్యాపకం ఇది ఆనందరావుకి.

ఎవరైనా ఫేస్‌బుక్‌లో పోస్టింగ్‌లు పెడితే చప్పట్లు కొట్టడం, అభినం దించడంలో ఆనందానుభూతులు పొందుతూ కాలం గడుపుతుంటాడు పేరుని సార్థకం చేసుకుంటూ ఆనందరావు.

కొంతమంది ఇతని నుంచి వచ్చే మెసేజ్ చూడగానే భయంతోఉలిక్కి పడుతుంటారనేది చెవులు కొరుక్కునే సీక్రెట్!

ఆనందరావు ఎదుగుదల చూడలేని వాళ్ళు అలా ప్రవర్తిస్తారని అస్మదీయుల ఉవాచ!




24 గంటల్లో 18 గంటలు ఇదే పని.

బ్రష్ చేసుకుంటున్న ఆనందరావుకి 'టింగ్' మంటూ వాట్సాప్ నోటిఫికేషన్ ఒకటొచ్చింది... వినిపించింది.

అంతే! ఒక గెంతుతో ఫోన్ చేరుకుని, దాన్ని రెండు లైన్లు చదివిన ఆనందరావు ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

'సోషల్ మీడియాల్లో మీరు చేస్తున్న సేవకు గానూ 'మీకోసమే మేము' అనే ప్రముఖ సాంస్కృతిక సంస్థ మీకు పురస్కారం....' ఇస్తున్నట్లు ప్రకటన అది.

ఆ ప్రకటన చూడగానే 'కెవ్వు'న అరిచాడు. నాలుగు లైన్లు చదివాక మరుక్షణంలో 'కుయ్యో' మంటూ డీలా పడిపోయాడు.

ఇదిగో అప్పట్నుంచి మొదలైంది ఆనందరావుకి మానసిక వేదన!

చాలా అసహనంగా ఉంది. ఎవరికైనా అవార్డు వస్తుందంటే చాలా సంతోషించాలి కదా?... మరి మన ఆనందరావు మాత్రం దానికి భిన్నంగా చాలా దిగాలుగా మారి పోయాడు.

విషయం ఎవరితో పంచుకోలేక పోతున్నాడు... బాధ ఏమిటో ఎవరికీ చెప్పలేక పోతున్నాడు.

గ్రూప్‌ల్లో... ఆనందరావుకి అభినందనలు, ప్రశంసలు, పొగడ్తలు! అందరూ కంగ్రాట్స్... కంగ్రాట్స్... అని మెసేజ్‌లు పెడుతున్నా... కనీసం థాంక్స్ అని చెప్పడానికి కూడా మనసొప్పట్లేదు....

ఏదో వింత బాధ... చెప్పుకోలేని దుఃఖం!

అలాంటి సమయంలో 'మీకోసం మేము' సంస్థ నుంచి ఫోన్ వచ్చింది.

"ముందుగా మీకు అభినందనలు! ఫేస్బుక్, వాట్సాప్ మాధ్యమాల్లో మీరు చేస్తున్న ఎనలేని సేవను మేము గుర్తించి... ప్రముఖ రచయిత శ్రీ పోతురాజు, ప్రముఖ నాట్యకారులు– శ్రీ రామరాజుగార్ల పేర్లతో ఈ ప్రతిష్ఠాత్మకమైన పురస్కారం ఈ సంవత్సరం మీకు ఇవ్వదలచుకున్నాం. ఈ పురస్కారం ఈనెల 24వ తేదీన మా ఊరిలో మీకు సన్మానం చేసి ఇస్తాం... మూడు వేల రూపాయల నగదు బహుమతి కూడా ఇస్తాం! మీ అంగీకారం రేపటిలోగా తెలుపగలరు." అని ఫోన్ పెట్టేశారు.

ఆనందరావు టెన్షన్‌తో కూడిన దిగులు మరింత రెట్టింపయ్యింది.

రేపటిలోగా తన అంగీకారం తెలపమంటున్నారు?...

ఏం చెప్పాలి?...

ఒప్పుకోవాలా వద్దా?...

ఇలా నానా రకాల సందేహాలతో సతమతమౌతూ... వస్తున్న మెసేజ్‌లకు రిప్లై ఇవ్వకపోయేసరికి...

అతని సన్నిహిత స్నేహితుడు ఫోన్ చేశాడు.

"ఏంట్రా! 'మీకోసం మేము' లాంటి గొప్ప సంస్థ ఈ యేడాది అవార్డు నీకు ప్రకటిస్తే... షాక్‌కి గురయ్యావా ఏంటీ?! అభినందనలు తెలిపే వారికి కూడా రిప్లై ఇవ్వటం లేదు? ఏం జరిగింది? వంట్లో బాగానే ఉందా కదా?" ఇలా ప్రశ్నల వర్షం కురిపించాడు.

"ఏం చెప్పమంటావురా నా బాధ!... ఏ పురస్కారం వచ్చిందంటే ఏం చెప్పమంటావురా? నువ్వూ చూసావుగా ఆ పురస్కారం పేరు! ఆ ఇద్దరి ప్రముఖుల పేర్ల మొదటి అక్షరాలతో ఇస్తున్న ఈ **'పోరా పురస్కారం'** వచ్చిందని చెప్పడానికి ఇబ్బందిగా ఉంది. అందుకే ఎలా స్పందించాలో అర్థం కావట్లేదు. మరీ 'పోరా పురస్కారం' ఏమిట్రా! ఈ పేరు అందరికీ ఎలా చెప్పనురా?" అని సమాధానం చెప్పి టక్కున ఫోన్ కట్ చేసేసాడు... ఉక్రోషం బుస కొడుతుండగా!

మొదటి అక్షరాల పొట్టి పేర్లతో... వచ్చిన చిక్కుల్లో చిక్కుకు పోయిన ఆనందరావు బాధగా!




**పొట్టి పేర్లు**

| | | |
|---|---|---|
| ఈడ్పుగంటి గంగ | – | ఈగ |
| దోర్నాల మనోజ్ | – | దోమ |
| చేమకూర పద్మ | – | చేప |
| గోపరాజు లక్ష్మణ్ | – | గోల |
| కేశినేని కమల | – | కేక |
| మేదరి కమల్ | – | మేక |
| దొండపర్తి గణపతిరావు | – | దొంగ |
| సీమంతం సాయినాథ్ | – | సీసా |
| కూడికల రమాదేవి | – | కూర |
| రజకుల సంజన | – | రసం |
| పాలకూర పినాకిని | – | పాపి |
| తంగుడు తాతారావు | – | తంతా |
| పంతుల దివాకరం | – | పంది |
| పానకాల పంకజం | – | పాపం |

**(సరదా కోసం మాత్రమే)**

# బాపు బొమ్మల కొలువు@60

**తెలుగు జాతికి గర్వకారణమైన 'చిత్రకళాచిరంజీవి'... గీత- రాతలతో ఓ నూతన శకానికి నాంది పలికిన ప్రముఖ చిత్రకారులు, చలనచిత్ర దర్శకులు అయిన శ్రీబాపు బొమ్మల ప్రదర్శన హైదరాబాద్, తెలుగు యూనివర్శిటీలో జూలై-22,23,24 తేదీలలో నిర్వహించబడింది.**



**బా**పు బొమ్మల ప్రదర్శన తొలిసారిగా హైదరాబాదులో 1962 జూలై 22న జరిగి... 60 ఏళ్లు నిండిన సందర్భాన్ని పురస్కరించుకొని, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో, హాస్యానందం, అక్షజ్ఞ పబ్లికేషన్స్, బాపు రమణ అకాడమీ ఈ 'బాపు బొమ్మల కొలువు 60' ఏర్పాటు చేశారు.

ఈ బొమ్మల కొలువులో బాపుగారు గీసిన చిత్రాల నకళ్ళు, బాపుగారు కొందరు వ్యక్తులకు, సంస్థలకు గీసిచ్చిన ఒరిజినల్ చిత్రాలను సహృదయుల సౌజన్యంతో సేకరించి దాదాపు 400 చిత్రాలతో ఉచిత ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది.

ప్రముఖ చలనచిత్ర నటుడు, రచయిత, దర్శకుడు అన్నింటికీ మించి బాపు చిత్రకళా భక్తుడైనటువంటి శ్రీతనికెళ్ల భరణిగారు ముఖ్యఅతిథిగా విచ్చేశారు.

శ్రీతనికెళ్ళభరణి, హాస్యానందం ఎడిటర్ శ్రీ పి.రాము, శ్రీ ఓలేటి పార్వతీశం, ఈ ప్రదర్శనను ప్రారంభించారు.

బాపు గారితో వారికున్న అనుబంధాన్ని కొనియాడారు.

ఈ వేడుకలో వేదికను పంచుకున్న ప్రముఖ వ్యాఖ్యాత, వక్త శ్రీ ఓలేటి పార్వతీశం బాపుగారు గీసిన బొమ్మల్లోని వైశిష్ట్యాన్ని, విలక్షణతని ప్రత్యేకంగా ప్రస్తావించారు.

ఈ కార్యక్రమానికి హాజరైన విజయవాడకు చెందిన బాపు అభిమాని శ్రీ బి.ఎమ్.పి.సింగ్, బాపుగారి గీతల్లో రాతల్లో తన ఉనికిని స్థాపించిన తీరును ఎంతగానో ప్రశంసించారు. తెలుగుజాతి ఉన్నంతవరకు బాపు బొమ్మకు 'ఖ్యాతి' ఉంటుందని అన్నారు.

ముఖ్యంగా ఈ మూడు రోజుల ప్రదర్శనకు తెలుగు విశ్వ విద్యాలయంలో చిత్రలేఖనాన్ని నేర్చుకుంటున్న బిఎఫ్ఏ/ ఎమ్.ఎఫ్.ఏ విద్యార్థిని విద్యార్థులు విశేష సంఖ్యలో సందర్శించి, కళారత్న బ్నిం గారి ద్వారా బాపు గారి చిత్ర కళా నైపుణ్యాన్ని,








వారి చిత్రాలలో దాగి ఉన్న మెళకువలను, చిత్రలేఖనానికి సంబంధించి ఎందరికో బాపుగారు అందించిన పాఠాలను ఆసక్తిగా విని ఆనందిస్తూ... ఈ ప్రదర్శన తమ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయటం వల్ల తమకు ఎంతో ఉత్సాహం, స్ఫూర్తి, ప్రేరణ కలిగాయన్నారు.

ప్రదర్శన చివరి రోజు 24వ తేదీన... తెలంగాణరాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు శ్రీ మామిడి హరికృష్ణ- బాపుగారి బొమ్మలల్లో విలక్షణత, విశిష్టత గురించి విశేషంగా విశదపరిచారు.

కళాహృదయులు డాక్టర్ గురవారెడ్డి రెడ్డిగారు బొమ్మలకొలువుకు విచ్చేసి, బాపుగారిపై తనకున్న అభిమానానిన్ని వ్యక్తం చేస్తూ... వారితో గడిపిన మధుర క్షణాల్ని గుర్తు చేసుకున్నారు.

ఆకాశవాణి రిటైర్డ్ డైరెక్టర్ శ్రీమతి శైలజాసుమన్ బాపుగారి కళ పరిపూర్ణత్వాన్ని గురించి వివరించారు. ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీ సరసిగారు బాపుగారి చిత్రాల, కార్టూన్ల వైభవాన్ని స్మరించుకున్నారు. ప్రముఖ కార్టూనిస్టులు, చిత్రకారులు ఈ ప్రదర్శనని ఉత్సాహంగా సందర్శించారు.


బాపూ రమణ అకాడమీ కార్యదర్శి శ్రీ వి.సుబ్బరాజు, కార్యక్రమ సంచాలకులు కళారత్న బ్నిం పాల్గొనగా...అక్షయ పబ్లికేషన్స్ అధినేత శ్రీవెంకట్ వందన సమర్పణ చేశారు.

ఈ సందర్భంగా వేసిన నాన్‌స్టాప్ వీడియో ప్రదర్శన ఎంతోమంది ప్రేక్షకులని ఆనందపరిచింది. నాట్య గురువు టీ.ఎస్.శిరీష శిష్య బృందం చేసిన 'బాపు బొమ్మలు' నాట్య ప్రదర్శన వీక్షకులని ఆకట్టుకుంది.

**-ఆర్.పి**







# యువరానర్... ఆడవాళ్ళు అమాయకులు!

నల్లబాటి రాఘవేంద్రరావు,
9966212386

**సకలసద్గుణరావు తన గుండెలోని అగ్నిగుండంలాంటి బరువంతా లాయరుగారు ముందు భళ్ళున వెళ్లగక్కి... మాంసం ఎముక కంఠంలో అడ్డుపడిన పెంపుడు కుక్కలా... ముక్కు నుంచి, నోటి నుంచి ద్రవాలు స్రవిస్తూ ఉండగా... దీనంగా ముఖం పెట్టాడు.**

"డోంట్ వర్రీ మిస్టర్ సకలసద్గుణరావు! ఈ లాయరు చిప్పేశ్వర రావు కేసు టేకప్ చేస్తే... తిరుగుండదు. ఆс! నేను అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పు... మీ ఆవిడ ఏ ఊరిలో కొన్నప్పటికీ... ప్రతి చీర.. నెల తిరక్కుండా చిరిగి పోతున్నాయి...అదే కదా నీ అభియోగం... ఎస్! ఇప్పుడు మనం బడాబడా క్లాత్ ఫ్యాక్టరీల మీద కేసు ఫైల్ చేయ బోతున్నాం!" ర్యాకులోంచి అతిపెద్ద లా బుక్.. శుభ్రంగా దులిపి పక్కన పెడుతూ అన్నాడు లాయరు చిప్పేశ్వరరావు.

"అయ్య బాబోయ్! ఆఫ్ట్రాల్ చీరల గురించి పెద్ద వాళ్ళతో పోరాటమా లాయర్ గారు!" బెదిరిపోయాడు సకల సద్గుణరావు.




"తప్పదు బామ్మర్ది! మీ ఆవిడను 'చెల్లెమ్మా' అని పిలుస్తూ ఉంటాను కదా... మీకు ఫ్రీగా సహాయం చేయడమే నా విద్యుక్తధర్మం... నువ్వు కంగారు పడకు. అదేదో సినిమాలో హీరోగారు దేవుడి మీద కేసు పెట్టగాలేంది... నువ్వు బడాబడా క్లాత్ ఫ్యాక్టరీల మీద కేసు పెడితే తప్పేంటి అంట!... అయినా ఇది ఇప్పుడు మీ భార్యభర్తల సమస్య మాత్రమే కాదు... హోల్ మొత్తం దేశం... ఈ కేసు గురించి... దీని ఫలితం గురించి వేయి కళ్ళతో ఎదురు చూసేలా చేస్తాను. తమాయించుకో. కేసుకు సంబంధించిన ముఖ్యమైన విషయాలు చెల్లెమ్మతోటే మాట్లాడతాను మనిద్దరం మీ ఇంటికే వెళ్దాం పద!"

✦ ✦ ✦

"చూడు చెల్లెమ్మా! సకలసద్గుణవతీ.. ఇక్కడ నువ్వు పెట్టిన 35 చీరలు... ఎలకలు కొరికినట్టు, ఆసిడ్ చుక్కలు ఒలికి బెజ్జాలు పడ్డట్టు...ఇవన్నీ చూస్తుంటేనే నా గుండె రంధ్రాలు పడ్డట్టుగా ఉందమ్మా! తట్టుకోలేకపోతున్నా. గుజరాత్‌లో అప్పలకొండ క్లాత్ ఫ్యాక్టరీఅయినా పర్వాలేదు... మహారాష్ట్రలో మాధవీలత క్లాత్ ఫ్యాక్టరీ అయినా పర్వా లేదు... మొత్తం అందరి మీద కేసులు పెట్టి కోర్టుకి లాగేద్దాం! షాపుల వాళ్లకు ఏం తెలుసు... పాపం అమాయకులు అసలు క్లాత్ ఫ్యాక్టరీల యాజమాన్యం మీదే కేసులు పెట్టేద్దాం... ఈ దెబ్బతో మనందరికీ నేమ్ అండ్ ఫేమ్!!"

కోటు బటన్లు లాగేసుకున్నట్టు మాట్లాడాడు లాయర్ చిప్పేశ్వర రావు... చీరలన్నింటినీ నిశితంగా పరిశీలిస్తూ...

"థాంక్స్ అన్నయ్యగారు! థాంక్స్.... 500 రూపాయల చీరలు... వెయ్యి రూపాయల చీరలు... అన్నీ నాశనమైపోయాయి. కోర్టుకు వచ్చి నా బాధంతా చెప్పడానికి నేను సిద్ధంగా ఉన్నాను." ముక్కు మూడుసార్లు చీల్చుకున్నట్లు చీదుకుంటూ భరోసా ఇచ్చింది సకలసద్గుణవతి.

"ఏడవకు అమ్మ! ఏడవకు తల్లి... నా చిట్టి తల్లి... నా చెల్లి... నేనె లాగూ ఒక చీరముక్క పెట్టలేక పోయాను. కనీసం నీ చిరిగిపోయిన చీరల బదులు కొత్త చీరలు తెప్పించలేనా?...అంతటి అసమర్థుడు కాదమ్మా నీ అన్నయ్య.! చూస్తా వుగా... చరిత్ర రాస్తా! నీలా కుమిలి పోతున్న స్త్రీ లోకానికి పెద్దదిక్కు అవుతానమ్మ నేను! అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పమ్మా!"

"అడగండి అన్నయ్యగారు! నేను తెలుగింటి ఆడనారీమణిలా... చెప్పడానికి సిద్ధంగా ఉన్నాను."

"ఒకే! మీ ఇంట్లో ఎలుకలు ఉన్నాయా?"

"ఎలకలు కాదు కదా పిల్లులు కూడా లేవు. ఏదైనా ఎప్పుడైనా వంటింట్లో కనబడ లేదంటే అది మీ బామ్మర్ది గారి పనే అయి ఉంటుంది... అన్నయ్య గారు!"

"ఇట్స్ ఆల్ రైట్! అసలు కథలోకి వద్దాం. ఎప్పుడైనా ఇల్లు శుభ్రం చేయడానికి బజారు

నుండి యాసిడ్ బాటిల్ తెచ్చారా?"

"అది అంటేనే మా ఆయన గారికి చచ్చేంత భయం అన్నయ్యగారు!"

"చాలా బాగుందమ్మా ఇప్పుడు క్లూ దొరకబోతుంది... నా పద్ధతి ఏంటంటే... మనం ఎదుటివాళ్ల మీద కేసు పెట్టే ముందు మన తరుపున లొసుగులు ఏమీ ఉండకూడదు! అప్పుడు గట్టిగా వాదించగలం.

"ఓకే ఓకే సద్గుణరావు! మీ దగ్గర ఉన్న ఆ చీరల బిల్లులు మొత్తం అన్ని ఇలా ఇచ్చెయ్! మొత్తం 100 పేజీల కేసు ఫైల్ చేసి... చెల్లెమ్మ చేత సంతకాలు పెట్టించుకుని, కోర్టులో సబ్మిట్ చేసి వాళ్లందరి తాట తీస్తా... చూస్తా వాళ్ళ అంతు చూస్తా!"

అంటూ మొత్తం బిల్లులు తీసుకొని పెద్ద పెద్ద అంగలతో బయటకు వచ్చేసాడు లాయర్ చిప్పేశ్వరరావు.


దాంతో సకల సద్గుణవతి సకలసద్గుణరావు ఇద్దరూ ఎగిరి గంతేసారు... అబద్ధంగా కాదు... నిజంగానే! అంతే సకల సద్గుణరావుకి పైన గడప తగిలి చిన్నగా నెత్తి బొప్పి కట్టింది... సకల సద్గుణవతి పొట్టి కనుక దెబ్బ ఏం తగలకుండా సేఫ్ అయ్యింది.


✦ ✦ ✦

ఆ మర్నాడు– లాయర్ చిప్పేశ్వరరావు తన ఆఫీసులో ఉండగా... ఒక జంట లబోదిబో మని నెత్తీనోరూ వాట్లతో పాటు గుండెలు కూడా బాదుకొంటూ వచ్చారు.

లాయర్ చిప్పేశ్వరరావు వాళ్ళిద్దరినీ ప్రశాంత పరచి చెరో గ్లాసుడు మంచి నీళ్లు ఇచ్చి... కేసు విషయం చెప్పమన్నాడు.

"సార్! సార్!! నాదో భయంకరమైన సస్పెన్స్ కథ సార్! పూర్తి వివరాలు చెప్పడానికి నాకు అంత ఓపిక లేదు... మా పెళ్లయి 12ఏళ్లు అయింది సార్!... రోజూ 'ఒక విషయం' గురించి మా ఇద్దరి మధ్య గొడవ... మహా గొడవ... దాంతోఇప్పటి వరకు పిల్లలు కూడా పుట్టలేదు






సార్... ఎడముఖం పెడముఖం! అలా అయితే ఎలా పుడతారు పిల్లలు... మీ అనుభవంతో మీరే చెప్పండి!"

ఆ వచ్చిన వ్యక్తి సింగినాదం దాదాపు కాదు పూర్తిగా ఏడుస్తూ ఇంకా చెప్తున్నాడు.

"ఆపు! ఆపు!! అర్థమైంది... కేసు పూర్తిగా అర్థమై పోయింది... ఇది మీకు పిల్లలు లేరు అన్న సమస్యకు సంబంధించిన కేసు కదూ!" తను జీనియస్ అన్న విధంగా ఓ ఫోజిచ్చాడు లాయరు చిప్పేశ్వరరావు.

"ఎంతమాత్రం కాదుసార్!... ఈ 12 ఏళ్ళ నుండి నేనొక అరకొర తింగర మంగళ సమస్యతో బాధపడుతున్నాను సార్! విషయం ఏమిటంటే– సూటిగా చెప్పినా... కింద నుంచి చెప్పినా... పైనుంచి చెప్పినా...అడ్డదారిలో చెప్పిన... తిరగేసి మరగేసి చెప్పినా... ఒకటే సార్! ఈ నా భార్య... స్టవ్ దగ్గర వేడి గిన్నెలు దింపడానికి పాత గుడ్డ పెట్టుకోవడం లేదు... ఆవిడకు 'పట్టుకారు' అలవాటు కూడా లేదు. ఇదే నా భయంకరమైన సమస్యసార్!"

ఆ వచ్చిన సింగినాదం పూస గుచ్చినట్టు చెప్పి...ఆ యొక్క కారణం చేత తన భార్య నుండి తనకు విడాకులు మంజూరు చేయవలసినదిగా కోరి కోరి ఊపిరి తీసుకున్నాడు!

"ఆవకాయ పచ్చడిలో హారతి కర్పూరం కలుపుకు తిన్నట్టు ఉంది నీ సమస్య! ఇదో పెద్ద కేసా?... పైగా సస్పెన్స్ కథట!... ఎల్లు ఎల్లవయ్యా..." చిరాకు పడ్డాడు లాయరు.

సింగినాదం లాయరు గారి కాళ్ళమీద పడిపోయాడు.




"మీరు అలా అంటే మీ దగ్గరే ఉరి పోసుకుని చచ్చిపోతాను సార్! ఆవిడ స్టవ్ దగ్గర వేడి గిన్నెలు దింపడానికి పాతగుడ్డ పెట్టుకోకపోవడంవల్ల... నాకు నెలకు వెయ్యి రూపాయలు ఎక్స్‌ట్రా ఖర్చు అవుతుంది సార్! మధ్య తరగతి గాడిదను సారీ... గాడిని! భరించలేను...ఆవిడకు ఆ అలవాటు అవడం లేదు... కాబట్టి నాకు విడాకులు ఇప్పించండి సార్..." అంటూ సింగినాదం లాయరుగారి కాళ్లు వదలకుండా గట్టిగా పట్టుకున్నాడు.

చిప్పేశ్వరరావుకి కేసు అర్థం కాలేదు.

బుర్ర విదిలించుకున్నాడు...కానీ సకల సద్గుణరావు కేసుకి ఈ కేసుకి మధ్యలో తెగిపోకుండా ఉండేటటువంటి బలమైన లింకు ఏదో ఉందని మాత్రం గ్రహించగలిగాడు.

తీవ్రంగా ఆలోచిస్తూ పొట్టమీద గోళ్లతో గోక్కున్నాడు... సిమెంట్ గోడ కేసి వీపు రుద్దుకున్నాడు. అయినా ఆవగింజలో అరపూసంత కూడా అర్థం కాలేదు.

"నువ్వు చెప్పేదేంటో నాకు అర్థం కావడం లేదయ్యా! ముక్కలు ముక్కలుగా చెప్తున్నావు ఒక ముక్కకు ఇంకొక ముక్క మ్యాచ్ అవటం లేదు... పైగా సస్పెన్సు కథ అంటున్నావు... స్టవ్ అంటున్నావు... పాత గుడ్డలు అంటున్నావు... పట్టుకారు అంటున్నావు... నా బొంద సస్పెన్స్ ఏమిటో నాకు ఇంత వరకు అర్థం కాలేదు! చివరి వరకు సస్పెన్స్ మెయింటెయిన్ చేయడం నావల్ల కాదు. అటో ఇటో తేల్చి పడేయడమే నా ప్రధాన ధర్మం..."

ఒక్కక్షణం ఆగి–

“సరే నా స్టైల్‌లో నీ కేసు టేకప్ చేస్తాను. ముందుగా మీ ఇంటికి వచ్చి కొన్ని ప్రశ్నలు అడిగి మీ కిచెన్ లో ఏం జరుగుతుందో నేను దగ్గరుండి చూశాక... అప్పుడు ఎవరు ఎవరికి విడాకులు ఇవ్వాలో తేల్చిపడేస్తాను... మీరు ముందు బయలు దేరండి... మీ వెనకే నేను మోపెడ్ మీద వచ్చేస్తా.” అంటూ లాయర్ చిప్పేశ్వరరావు లేచాడు.

✦ ✦ ✦

ముగ్గురు కలిసి సింగినాదం ఇంటికి చేరుకున్నారు.

“చూడమ్మాయి! సింగినాదంగారి భార్య...నీ పేరు ఏమిటి?” లాయర్ చిప్పేశ్వరరావు ప్రశ్నించాడు.







“నా అసలు పేరు జి.ఎల్.కీర్తి... కానీ అందరూ జీలకర్ర అని పిలుస్తారండి.”

“నాకు అలాగే పిలవాలని ఉందమ్మా! సరే ముందు కిచెన్లోకి నడు... సింగినాదం! నువ్వు వీధిలో కూర్చో! ఆc... ఇప్పుడు నేను చెప్పినట్లు చెయ్యమ్మా! నీ చేతితో కాస్తంత వేడివేడి టీ పెట్టి నాకు ఇయ్యి!” అని అడిగి...దగ్గరే ఉండి గమనిస్తున్నాడు చిప్పేశ్వరరావు.

జీలకర్రమ్మ గిన్నె తీసుకొని, గ్యాస్ స్టవ్ వెలిగించి టీ పెట్టింది. బాగా మరిగింది... గిన్నె కూడా బాగా వేడెక్కింది... టీ పొంగులు వస్తుంది... ఆమె ఏం చేస్తుందో అని చిప్పేశ్వరరావు చాలా నిశితంగా పరిశీలిస్తున్నాడు... అంతే! జీలకర్రమ్మ టక్కున తన పైటచెంగు రెండు చేతులతో పట్టుకుని అదే చెంగుతో వేడి వేడి టీ గిన్నెను పట్టుకుని... చాలా సునాయాసంగా క్రిందకు దింపి వడకట్టి వేడివేడి టీ లాయర్ గారికి అందించింది.

ఎక్కడో కలుక్కుమంది లాయర్ గారికి. కానీ ‘ఎక్కడ’...‘ఎలా’ అన్నదో గ్రహించుకోలేక పోయాడు. కానీ ఏదో పాయింటు అందీ అందనట్లు దొరికీ దొరకనట్టు అనిపించింది.

“ఏమ్మా! నీకు స్టవ్ దగ్గర పాత గుడ్డలు పెట్టుకోవడం అలవాటు లేదా?... పోనీ పట్టు కారు.”




“లాయర్ గారు! మా అమ్మ, అమ్మమ్మ, ఆవిడ అమ్మ, వాళ్ళ అమ్మమ్మ... అందరూ వేడి వేడి గిన్నెలు స్టవ్ మీద నుండి క్రిందకు దింపినట్టే నేను కూడా చేస్తున్నాను తప్పంటారా? ఇంత మాత్రానికే విడాకులు ఇస్తారా? ఆయన ఇస్తే... నేనూ కూడా ఇస్తాను! నాకు భయమా!” చాలా అమాయకంగా అంది జీలకర్రమ్మ.


“విడాకులు లేదు ఇస్తరాకులు లేదు! సరే టీ చాలా బాగుంది. ఈసారి కాస్త వేడి కాఫీ పెట్టమ్మా!” మళ్లీ అడిగాడు చిప్పేశ్వరరావు.

“ఇప్పుడేగా టీ తాగారు మళ్లీనా?!” అంటూ వేడి వేడి కాఫీ పెట్టింది జీలకర్రమ్మ.

లాయర్ మళ్లీ ఆమె దగ్గరే నిలబడ్డాడు.

ఈసారి కూడా ఆమె వేడి వేడి కాఫీ గిన్నె ఏ మాత్రం ఆలోచించకుండా తన పైట చెంగుతో పట్టుకొని చాలా సునాయాసంగా దింపేసి లాయరుగారికి టీ వడకట్టి అందించింది...

ఆయన హాల్‌లోకి వచ్చి రెండు చేతులతో బుర్రను గట్టిగా పట్టుకొని అటు ఇటు విదిలించాడు... తన బుర్రను అక్కడున్న అద్దాల టీ పాయికి కొట్టుకోవాలి అనుకున్నాడు... భయమేసి ఆ పని మానుకుని బయట నిలబడున్న సింగినాదంని పిలిచాడు.




"చూడబ్బాయి సింగినాదం!... నీ బాధ ఇప్పుడు నాకు అర్థమైందయ్యా! సరే నేను మీ సమస్యను పరిష్కరిస్తాను కానీ... గౌరవనీయులైన మీ భార్యగారు ఇచ్చిన మంచి క్లూతో మరో కేసులో ఓ గొప్ప పరిష్కారం దొరికిందయ్యా. ఇంత గొప్ప క్లూ ఇచ్చినందుకు, నీ దగ్గర ఫీజు తీసుకోకుండా మీ భార్య భర్తల సమస్య క్లియర్ చేసే పూచీ నాది... సరే! ఓ జీలకర్రమ్మ! అమ్మ... తల్లి...నువ్వు కట్టుకునే చీరలు డ్యామేజ్ ఏమైనా అయ్యాయా?" ప్రేమగా అడిగాడు లాయర్ చిప్పేశ్వరరావు.

"సమస్య అంతా అదే కదా సార్! ప్రతినెలా కొత్త చీరలు కొనడానికి నాకు వెయ్యి రూపాయలు అవుతుంది. చెప్పాను కదా సార్!..." అంటూ బీరువాలో చీరలు మొత్తం తెచ్చి లాయర్ గారి ముందు పోశాడు సింగినాదం. లాయర్ ఆత్రుతగా ఆ చీరలలో ప్రతి చీర పైటచెంగు దగ్గర మాత్రమే డ్యామేజ్ అవ్వడం గ్రహించాడు.

"హుర్రేర్రే...!!" ఊపిరి తీసుకోకుండా గట్టిగా అరిచాడు.

సింగినాదంకు అర్థం కాలేదు.

"మళ్ళీ కలుస్తా !" అంటూ అక్కడ నుండి పరుగు కన్నా భయంకరమైన అడుగులు వేసుకుంటూ బయటకు వెళ్లి మోపెడ్ ఎక్కి జెట్ విమానం స్పీడులో ఏదో గొప్ప పరిశోధన ఆవిష్కరించినంత ఆనందంలో సకలసద్గుణరావు ఇంటికి చేరాడు లాయర్ చిప్పేశ్వరరావు.

లాయర్ చిప్పేశ్వరరావుని లోపలికి తీసుకెళ్లి సపర్యలు చేశారు సకలసద్గుణరావు సకల సద్గుణవతి... ఆయన తేరుకున్నాక... మహదానందంతో ఉప్పొంగిపోయాడు.

వెంటనే సకల సద్గుణవతిని కిచెన్ రూమ్ లోకి తీసుకెళ్ళి, అర్జంటుగా టీ కాయమన్నాడు.

ఆమె అలాగే చేస్తూ... టీ బాగా మరిగాక గిన్నె బాగా వేడెక్కాక టక్కున తన పవిటచెంగు రెండు చేతులతో అందుకుని... అదే పమిట చెంగుతో వేడి గిన్నెను పట్టుకొని సునాయాసంగా కిందకు దింపి వడకట్టి... టీ లాయరు గారికి అందించింది.

లాయర్ భూతద్దంతో పరిశీలించినట్టు కిచెన్ మొత్తం పరిశీలించాడు.

అక్కడ వేడి గిన్నెలు పట్టుకునే 'పాత గుడ్డ' కానీ 'చిన్న టవల్' కానీ చివరకు 'పట్టుకారు'... కానీ లేకపోవడం గ్రహించాడు. అంతేకాదు ఆమె ప్రతి చర్యను గమనిస్తున్న లాయర్ చిప్పేశ్వరరావు, టీ తో పాటు హాల్ లోకి వచ్చి, ఒక్క క్షణం ఆలోచించి–

"హుర్రే...యురేకా..." అంటూ కేక పెట్టి భరతనాట్యం చేశాడు. వెంటనే సకలసద్గుణవతి చేత బీరువాలోని ఆమె చీరలన్నీ తెప్పించి నిశితంగా పరిశీలించాడు.

చీరలన్ని పవిట చెంగు దగ్గర మాత్రమే డ్యామేజ్ అయ్యాయి!!

'సకలభార్యభర్తలు' ఇద్దరూ సంతోష ఆనంద భరితులైపోయారు.



తమ డ్యామేజ్ చీరలు స్థానంలో సరికొత్త చీరలు వచ్చేస్తున్నాయని ఆనందపడిపోయారు.

"అమ్మాయి నా చెల్లమ్మ! దీన్నిబట్టి అర్థం అయ్యింది ఏమిటి అంటే... నీ చీరలన్నీ కావాలని నువ్వే తగల బెట్టుకుంటున్నావమ్మా! హోల్ మొత్తం క్లాత్ ఫ్యాక్టరీల మీద మనం కేసు ఫైల్ చేస్తే అటు తిరిగి ఇటు తిరిగి చుట్టూ తిరిగి కేసు మొత్తం నీ పీక్కే అంటుకునే ప్రమాదం ఉంది చెల్లెమ్మా! అయినా ప్రాణం పోయినా నా చెల్లి మీద ఈగ వాలనిస్తానా... అందుకని ఇప్పుడు కేసుని మనమే రివర్స్‌లో తిప్పి పడేయాలి. జిగురులా మనకి అంటుకోకుండా స్క్రూ గట్టిగా బిగించి పడేయాలి... జాగ్రత్తగా వినండి మీరిద్దరూ... అంటూ లాయర్ చిప్పేశ్వరరావు తను ఫైల్ చేయబోయే కేస్ వివరాలు చెప్పడం ఆరంభించాడు.

✦ ✦ ✦

"అయ్యా! ఇందుమూలముగా కోర్టు వారికి సవినయంగా విన్నవించు కునేదేమిటి అంటే... సదరు క్లాత్ ఫ్యాక్టరీలవారు ఆడవాళ్ళ పట్ల ఆలోచన రాహిత్యంగా ఆలోచించి... చీరలు తయారు చేస్తున్నారు. పరమ పవిత్రమైన వారి చీరచెంగును అతి ప్రమాదకరమైన వేడి వేడి పాత్రలు పట్టుకొనుటకు ఉపయోగించి... తద్వారా రక్షణ పొందుతున్నారు. గౌరవప్రదమైన స్త్రీ జాతికి ఇది తరతరాలుగా యుగయుగాలుగా జరుగుతున్న స్త్రీల ప్రాణరక్షణ చర్య!... అటువంటి గౌరవప్రదమైన అతి పవిత్రమైన చీరచెంగు పట్ల చులకన భావంతో ప్రవర్తిస్తున్నారు ఈ క్లాత్ ఫ్యాక్టరీ ఓనర్స్...చీర అంతా ఎలా తయారు చేసినా పరవాలేదు కానీ 'చీర చెంగు' మాత్రం చాలా పకడ్బందీగా, పవర్ఫుల్ విధానంలో ప్రత్యేకంగా తయారు చేయవలసి ఉంది... కానీ అలా చేయకపోవడం వల్ల సదరు చీర క్వాలిటీనే చెంగుకు కూడా పెట్టడం వల్ల చీర చెంగులు మాత్రమే అతి భయంకరమైన వేడి వేడి అష్టకష్టాలు భరించలేక రోజూ కొంచెంకొంచెంగా కృంగిపోయి... కృశించిపోయి భళుక్కున చిరిగి పోతున్నాయి. ఇది నూటికినూరుపాళ్లు మహిళామణులు పట్ల అవమానచర్య!...అవగాహనలోపపు చర్య! అని కచ్చితంగా చెప్పవచ్చు.... యువరానర్... ఇది ముమ్మాటికీ క్లాత్ ఫ్యాక్టరీ ఓనర్స్ తప్పిదమే...అందుచేత యువరానర్! దేశంలోని క్లాత్ ఫ్యాక్టరీలు ఓనర్స్ అందరి మీద గౌరవప్రదమైన మా క్లైంట్ సకలసద్గుణవతిగారు ఫైల్ చేసిన ఈ కేసును స్వీకరించి, సదరు ఓనర్స్ అందరికీ సమన్లు పంపవలసిందిగా కోరుతూ ప్రార్థిస్తున్నాను యువరానర్!!"

లాయర్ చిప్పేశ్వరరావు సకలదంపతుల ఎదురుగా కేసు వాదించినట్లు వర్ణించి వర్ణించి ఆయాసం వచ్చి ఆవేశం వచ్చి... అక్కడే ఉన్న కుర్చీలో వాలిపోయాడు.


అలా అనే కన్నా సొమ్మసిల్లి పడ్డాడు అనడం నూటికి నూరు పాళ్ళు బెటర్.

ఇప్పుడతనికి మంచి నీళ్లు అందించి సపర్యలు చేసే దిక్కులేదు!


ఎందుకంటే....

'సకల దంపతులు అతన్ని పట్టించుకోలేదు... కేసు చాలా పకడ్బందీగా తయారు చేస్తున్నందుకు తమ గదిలోకి వెళ్ళిపోయి మహదానందంతో అన్ని రకాల నృత్యాలు ఏకంగా కలిపి చేసి పడేస్తున్నారు.

## జోక్స్ జోన్




**ఎన్.ఆర్.కె.ఎస్.వి.మూర్తి,**
**హైదరాబాద్**



**కో**డి పిల్ల తల్లితో– "అమ్మా! మనుషులు పుట్ట గానే వాళ్ళకి పేర్లు పెడతారు మరి మనకెందుకు ఉండవు?"

తల్లి కోడి– "మనకి పుట్టగానే పేర్లు ఉండవు కానీ... మనం చచ్చిన తరువాత మనుషులే మనకి 'చికెన్ 65', 'చికెన్ టిక్కా', 'చికెన్ తందూరి', 'చికెన్ మలై', 'చిల్లి చికెన్'... అని పేర్లు పెడతారు!

✦ ✦ ✦




**భ**క్తుడు: స్వామిజీ ఆడవారు ఎక్కువదాస్తారా?... మగవారు ఎక్కువ దాస్తారా?...

స్వామిజీ : ఆడవారు వయస్సు ఒకటే దాస్తారు... అదే మగవారైతే బట్టతల దాయాలి... పొట్ట దాయాలి... తెల్ల వెంట్రుకలు దాయాలి... జీతం దాయాలి... ఆఖరికి ఫోన్‌లో ఆడవాళ్ళ నెంబర్లు దాయాలి!...

✦ ✦ ✦

**సు**బ్బారావు: ఒరేయ్ అప్పారావు! నాకొక సందేహం!

అప్పారావు : అడుగు...



సుబ్బారావు : హోటల్‌లో తిని బిల్లు కట్టకపోతే హోటల్‌లో పని చెయ్య మంటారు కదా... మరి బ్యాంకులో లోను తీసుకొనికట్టకపోతే బ్యాంకు క్యాషియర్ కౌంటర్‌లో కూర్చొని పని చేయమని ఎందుకు అనరు?!

✦ ✦ ✦



**భ**ర్త : పుట్టింటికి పోయి కూడా నాతో ఫోన్లో ఎందుకు గొడవ పడుతున్నావు?

భార్య : నేను వర్క్ ఫ్రామ్ హోమ్ చేస్తున్నానండి!!

# నవ్వించే రాగాలు

ఫిదా చిత్రంలోని
'వచ్చిండే.. మెల్లా మెల్లగ వచ్చిండే...' పాటకు పారడి

**-ఎన్.పి.ఎస్.రావు, న్యూజిలాండ్**

వచ్చిండే.. మెల్లా మెల్లగ వచ్చిండే...నామినేషను యేసిండే
గమ్మున కూసోనియ్యాదే.. కుదురుగ నిల్సోనియ్యాదె
గొప్పగ మీటింగ్ ఎట్టిండే..కునుకే గాయబ్ చేసిండే
పిల్లడి ముక్కూ తుడిచేసీ... మస్తు ముద్దూ చేసిండే
హే.. అత్తా అంకమ్మా... అభ్యర్ధొచ్చిండే
రోడ్డులన్నాడే... నల్లాలన్నాడే
నోట్లు జల్లి ఓట్లు అడిగి
మన్ని ఉల్టా సీదా జేసిండే

**॥వచ్చిండే.. మెల్లా మెల్లగ వచ్చిండే...॥**

**చరణం:**నాయకులు మస్తు చాలూ..నాయకులు మస్తు చాలూ
నాయకులు మస్తు చాలూ.. మస్కలు కొడతా వుంటరే
నువ్ ఎన్న పూసలెక్క.. కరిగితె అంతే సంగతే
ఓ సారీ ఓటేసాకా..సో సారీ భవిష్యత్తే..
ఆ తప్పే నువ్వే చేస్తే... ఐదేళ్లూ ఏడుస్తావే...

**॥వచ్చిండే.. మెల్లా మెల్లగ వచ్చిండే...॥**

**చరణం:**అయ్ బాబోయ్ ఎంత ఖర్చో...
అయ్ బాబోయ్ ఎంత ఖర్చో...
అయ్ బాబోయ్ ఎంత ఖర్చో..సొమ్ములెట్టా పెట్టుడే?
అయ్ బాబోయ్ ఎంత ఖర్చో... సొమ్ములెట్టాపెట్టుడే?
ఓట్లన్నీ కొల్లగొట్టీ.. ఎన్నికలెట్టా నెగ్గుడే?
ఫరవాలే కులం పేరా.. చీల్చేసి ఓట్లే పట్టే
టెక్నిక్సే నాకున్నాయ్‌లే... పరెషానే నీకక్కర్లే...

**॥వచ్చిండే.. మెల్లా మెల్లగ వచ్చిండే...॥**

వచ్చిండే మెల్ల మెల్లగా వచ్చిండే .. నామినేషను యేసిండే
గమ్మున కూసోనియ్యాదే... కుదురుగ నిల్సోనియ్యాదె
గొప్పగ మీటింగ్ ఎట్టిండే.. కునుకే గాయబ్ చేసిండే
పిల్లడి ముక్కూ తుడిచేసీ... మస్తు ముద్దూ చేసిండే
తెల్లారే..తెల్లారే..తెల్లారే..తెల్లారే..తెల్లారే..తెల్లారే..
తెల్లారే..తెల్లారే..తెల్లారే.. బతుకే తెల్లారే...
తెల్లారే..తెల్లారే..తెల్లారే..బతుకే తెల్లారే...
తెల్లారే..తెల్లారే..తెల్లారే..

# టీశతకం

**-విట్టుబాబు**

కనవే... కనుగొనవే చెలి!
ధనియాలను బిండి చేసి దట్టించినచో
ఘన వైద్యము సేయునహో!
వని నెండిన పుల్లలేరి వండినచో 'టీ'. **53**

ఏలకుc, గుంకుమపూవున్
మాలిమితోc బాలc గలిపి మరిగించినచో
మేలిమి తేయాకులతోc,
దాలిమితో మిమ్ముc గాచుc ద్రాగిననే 'టీ'. **54**

దాల్చిన చెక్కను ద్రవమునc
దాల్చిన దానవు మసాల తళుకెందులకే!
కూల్చెదవే మధుమేహము
దేల్చుచు వడగట్టి త్రాగ తేనీరా! 'టీ!'. **55**

మొగమాటము లేలనా నీ
వెగబడరా కాంచినంతనే టీకప్పున్!
సొగసరి, పెండిలికొడకా
యగపడ నా రంభవోలె! నన నీతో 'టీ'. **56**

వేడగ నీశుని మోక్షము
జాడగ శివరాత్రి నాటి జాగరణమునన్
వాడగనీయక నరులను
గూడెదవే తోడు నీడ గొప్పవులే 'టీ'. **57**

పుట్టెడి గిట్టెడి జనులకుc
బట్టుబడని పరమతత్వ పరమార్థములే
చిట్టడవిని కనుగొని నినుc
బట్టుకు సుర గ్రోలినంత బట్టుబడెను 'టీ'. **58**

పుట్టిన జీవికి మరణము
గట్టెను పరమాత్మ బొంది గట్టిన నాడే
గిట్టుట యెరుగవు బ్రహ్మాయె
గుట్టుగ నమరత్వమిచ్చె కోరితివా 'టీ'. **59**

ఏచుట్టము గనిపించిన
నే చక్కని సందెవేళనే కళనున్నన్
రా! చక్కగ త్రాగెదమని
టీచుక్కన సాగునేమొ టెక్కుల పోటీ! **60**

( ధర నేనిస్తానంటే నేనిస్తానంటూ ఆత్మీయమైన వాదులాట )




# కార్టూన్ పోటీ ఫలితాలు



బాచి అవార్డుకి ఐదు సంవత్సరాల వయస్సు వచ్చేసింది.

ఈ అవార్డుని ప్రవేశ పెట్టిన ఉద్దేశమే వేరు... మన కార్టూనిస్టులకు పత్రికల నుండి తోడ్పాటు పూర్తిగా కనుమరుగైపోయే రోజులు వచ్చేసాయి. అవి మిణుకు మిణుకుమనే రోజుల్లోనే ఈ అవార్డు స్థాపించడం జరిగింది. దానికి మన కారూనిస్టుల ప్రోత్సాహం నన్ను ఎంతగానో సంతోష పెడుతున్నది. ఎన్ని అవాంతరాలు వచ్చినా 'అవార్డు'ని ఆపకూడదనే నా సంకల్పానికి పాపం కరోనా కూడా ఏమీ చేయలేకపోయింది.

ఈసారి కూడా కార్టూనిస్టులు విరివిగానే పాల్గొన్నారు. దాదాపు 50 నుంచి 60 మధ్యలో ఎంట్రీలు వచ్చాయి. చక్కని కార్టూన్లు అందాయి.

ఈసారి కార్టూన్ సెలెక్షన్లో నేను నామమాత్రంగానే పాల్గొన్నానని చెప్పొచ్చు... ఎందుకంటే నా ప్రొఫెషనల్ బిజీ వలన బాధ్యతంతా హాస్యానందం రాము, సీనియర్ కార్టూనిస్టు శ్రీకామేష్, మరియు మిత్రులు శ్రీ రమణ గార్ల భుజస్తంభాలపై మోపేశాను.

వారు సెలక్ట్ చేసిన తర్వాత చివరిలో నేను మమ అనిపించాను.

ఈసారి కూడా మంచి కార్టూన్స్ అందించి, బహుమతులు కొల్లగొట్టుకున్న నా కార్టూనిస్టు మిత్రులకు అభినందనలు మరియు శుభాకాంక్షలు.

ఎప్పటిలాగానే అన్ని తానై చేసే మన హాస్యానందం రాము గారికి, పిలవగానే పరిగెత్తుకుని విజయవాడ విచ్చేసిన మిత్రులు కామేష్‌గారికి, రమణ గారికి... నా ప్రత్యేక ధన్యవాదములు.

**-బాచి**


**మొదటి బహుమతి రూ.5000/-లు పొందిన కార్టూన్**




**రెండవ బహుమతి రూ.3000/-లు పొందిన కార్టూన్**




## మూడవ బహుమతి రూ.2000/-లు పొందిన కార్టూన్




## జ్యూరీ బహుమతులు పొందిన కార్టూన్లు... ఒకో కార్టూన్‌కి రూ.500/-లు నగదు బహుమతి











**బాచి అవార్డు, శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక కార్టూన్ల పోటీల్లో బహుమతి పొందిన విజేతలకు బహుమతి ప్రదాన సభ**

ఆగష్టు,15 వతేదీ, సోమవారం, విజయవాడ బందరురోడ్డులో రాఘవయ్య పార్క్ ఎదురుగా ఉన్న 'బాలోత్సవ భవన్‌లో' సాయంకాలం 6గంటలకు.




విజేతలకు




## డంబ్ మేన్

**తర్కారావు ప్రింటింగు ప్రెస్సు ఓనరు. జీతం పెంచమని అతని కింద పనిచేసే సుబ్బారావు ఎప్పుడొచ్చినా... అతనికి ఓ కథ చెప్పి... దాని ముగింపు చెప్తే జీతం పెంచుతానంటుంటాడు. ఇప్పుడు కూడా ఓ కథ చెప్పడం ప్రారంభించడంతో... సుబ్బారావు వినసాగాడు-**

తర్కారావ్ కాస్త గొంతు సవరించుకుని... "పిల్లబాబు, అతనికి ఎప్పటినుండో వైద్యం చేస్తున్న డాక్టర్ని, ఓ రోజు ఉన్నట్టుండి కసిగా అతని గొంతుని కసా పిసా పిసికి చంపేసాడు. దాంతో అతనికి ఏడేళ్ళు జైలు శిక్ష విధించారు జడ్జిగారు. ఇది తెలిసి, ముంబాయ్‌లో ఉంటున్న అతని స్నేహితుడు మధు, హుటా హుటిన విశాఖపట్నం కోర్టుకు వచ్చాడు. అయితే ఆ తీర్పుని మొత్తం ఓర్పుగా విన్న పిల్లబాబు, మహదానందపడిపోయాడు. సంతోషంతో ఊగిపోతూ చిరునవ్వుతో జడ్జిగారికి చాలా ధన్యవాదాలు చెప్పాడు.




కోర్టులో ఇదంతా గమనించిన అతని స్నేహితుడు మధు, విషయం అర్థం కాక, విషం మింగినట్టు మొహంపెట్టి, ఎవరూ చూడకుండా అక్కడికి దగ్గరలో ఉన్న ఓ బాత్రూంలోకి వెళ్ళి, కసితీరా జుట్టు పీక్కున్నాడు. తర్వాత మామూలుగా తల దువ్వుకుని, తిరిగి వచ్చి కోర్టు హాలులో కుదురుగా కూర్చున్నాడు. కానీ లాభం లేదు, ఇంకా పిల్లబాబు అలానే ప్రశాంతంగా ఉన్నాడు.

మధుకి అంతా గందరగోళంగా ఉంది. శిక్ష పడ్డాక ఎవరైనా లబో దిబో అంటారు. కానీ పిల్లబాబు ఇంత హ్యాపీగా ఉండటమేంటో మధుకి అంతుచిక్కలేదు. విషయం వివరంగా ఎవరిని అడగాలో తెలియలేదు. ఇక చేసేదేం లేక, ఆ విషయం పిల్లబాబునే అడిగి కనుక్కుందామని నిర్ణయించుకుని కాస్త కుదుటపడ్డాడు.

మరుసటిరోజు మధ్యాహ్నం జైలుకి వెళ్ళాడు. అక్కడ పిల్లబాబుని కలిసి, వైద్యం చేసిన డాక్టర్ని టపా కట్టించడం, పైగా ఆ నేరానికి గాను శిక్ష పడినందుకు సంతోషపడటం ఏవిటో ఎంత ఆలోచించినా తన మట్టి బుర్రకి విషయం అర్థం కావడం లేదంటూ చెప్పాడు మధు.

దానికి పిల్లబాబు కాస్త చిన్నగా నవ్వి, ఆ డాక్టరుకి ఏం చేతకాదనీ... జడ్జిగారే నయమనీ... జైల్లోనైతేనేం ఇప్పుడు ఏడేళ్ళు హాయిగా బ్రతికేస్తాననీ... డాక్టరుని చంపిన కారణం మరింత స్పష్టంగా చెప్పి మళ్ళీ మురిసిపోయాడు పిల్లబాబు.

ఆ విచిత్ర సమాధానం విని కాస్త అయోమయంగా చూస్తూ, ఇంకొంచెం జుట్టు పీక్కుని అక్కడి నుండి వచ్చేసాడు మధు.

ఇప్పుడు చెప్పు! అతను డాక్టరుని ఎందుకు చంపాడు? డాక్టరు చేయలేని పని జడ్జిగారు చేసారన్నాడు. అంటే ఏవిటి? నువ్వు కాస్త దగ్గరగా చెప్పినా నీ జీతం పెంచేస్తాను!" చెప్పాడు తర్కారావ్.

ముక్కు మీద వేలుపెట్టుకుని కొంతసేపు ఆలోచించిన సుబ్బారావ్-"ఎందుకో ఇది తేలికే అనిపిస్తోంది నాకు. ఇలాంటివి అయితే చెప్పేస్తాను. ఏం లేదు సార్... ఆ డాక్టరు అన్నాళ్ళూ అతన్ని వైద్యం పేరుతో మోసం చేసి ఉండొచ్చు. దాంతో పిల్లబాబు, అతనికి ఏవీ రాదని నిర్ధారించుకున్నాడు. ఇన్నాళ్ళూ ఆ డాక్టర్ చేసిన మోసానికి గాను అతన్ని టపా కట్టించాడు. అతను చేసిన నేరానికి తగిన శిక్ష విధించి, అతనకి పశ్చాత్తాపాన్ని, ఉపశమనాన్ని కలిగించిన జడ్జిగారే నయం అని అతని ఉద్దేశం కాబోలు. అంతేనా సార్!" అడిగాడు సుబ్బారావ్ కాస్త నమ్మకంగా.

"నీ సమాధానం... మళయాళం సినిమాని బోజ్‌పురీ డబ్బింగ్‌లో, తమిళ సబ్‌టైటిల్స్‌తో చూసినట్టుంది. సరైన సమాధానం అది కాదు తమరి బొంద! పిల్లబాబుకి వైద్యం చేస్తున్న వైద్యుడు, అతని ఆరోగ్య దృష్ట్యా, ఒక సంవత్సరంలో చనిపోవచ్చని చెబుతాడు. పిల్లబాబు అతన్ని ఎలా అయినా ఇంకొన్నాళ్ళు తనని బ్రతికించమని ప్రాధేయపడ్డా కుదరదనడంతో ఆ డాక్టర్ గొంతు పిసికేసాడు. తరువాత ఆ నేరానికి జడ్జిగారు, ఏడేళ్ళు జైల్లో జీవితం గడపాలని శిక్ష విధిస్తారు. దాంతో... డాక్టరు సంవత్సరంలో చనిపోతానన్నాడు... కానీ జడ్జిగారు ఏడేళ్ళు జైల్లో జీవితం గడపమంటున్నారు కాబట్టి, ఆరేళ్ళ నా ఆయుష్షు పెరిగిందని పిల్లబాబు అమాయకంగా మురిసిపోయాడు.అదీ జరిగింది. నువ్వు చెప్పలేక పోయావు కనుక ఈ సారి కూడా నీ జీతం పెంచడం జరగదు" అని తర్కారావు చెప్పగానే...

"మీ తర్కం మీదే కానీ నా తరపు అర్థం చేసుకోరు కదా!..." అనుకుంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు సుబ్బారావ్.






సుప్రసిద్ధ రచయిత **యండమూరి వీరేంద్రనాథ్**

**ఫన్** ప్రశ్నలకు-

ప్రముఖ హాస్య నటులు **సుదర్శనమ్**

**పంచ్** సమాధానాలు

*Cartoons: Sangram*


✦ మీ జీవితంలో బాగా సంతోషించిన విషాదకరమైన సంఘటన ఏమిటి?

**అట్రాక్టివ్‌గా రింగురింగులతో ఉండే ఉంగరాల జుట్టుపోయి... ‘గుండు’గా మారి ‘బ్రాండ్’ అయి... బోల్డ్ ‘డిమాండ్’ రావటం!**



✦ మీరు జవాబు చెప్పలేని ప్రశ్న ఒకటి వేసుకొని ఆన్సరు చెప్పండి.

**‘నిజమైన ప్రేమ అంటే ఏది?’ అన్నది నాకో జవాబులేని ప్రశ్న! ‘ఆన్సర్ అంటూ ఉంటే అది ప్రేమ కాదన్నది... నా ‘ఆన్సర్’!!**



✦ ఇద్దరు పెళ్ళాల ముద్దుల మొగుడు సంతోషిస్తాడా? ఇద్దరు మొగుళ్ళ ముద్దుల పెళ్ళాం ఆనందంగా ఉంటుందా?

**సంతోషం, ఆనందం అన్నారు బానే ఉంది... మొగుడూ పెళ్ళాలు అని లింక్ పెట్టారే...?! పాపం, అసలు తిరకాసు అంతా ఈ మొగుడూ పెళ్ళాలు ‘అవటం’లోనే ఉందంటున్నారు కొందరు సోకాల్డ్ ‘మోడ్రన్’ కపుల్స్! సో సేడ్!!**






✦ చేతులు కాలాక కాయలు ఎందుకు పట్టుకోకూడదు?

**ఆకులైతే నూరి ‘పసరు’ పిండుకోవచ్చు... పళ్ళైతే నొక్కి ‘రసం’ పిండుకోవచ్చు... చికిత్సకి! కాయలైతే నూరటం, పిండటం కుదరదు కదా మహాశయా!**



✦ ఎడారి మధ్యలో మీ విమానం దిగిపోతే ఏమి చేస్తారు?

**దిగిపోతే నో ప్రాబ్లమ్... దిగి, ‘పోతేనే’ ప్రాబ్లమ్! ఇసుక మాఫియాకి ఉప్పందిస్తా... ఐమీన్ ఇసుక అందిస్తా... డీల్ సెట్ చేస్తా!! (ప్రాబ్లమ్‌లోనే సొల్యూషన్ వెతుక్కోమన్నారు మీ బోటి పెద్దలు!)**




✦ జీవితం సినిమా హిట్టో, ఫట్టో ఎప్పుడు తెలుస్తుంది?

**పెద్ద కష్టమేం కాదు... ‘ప్రపంచం’ మనకా పనిని ఈజీ చేసేసింది...! ప్రతి స్టేజ్(ఫేజ్)లోనూ ‘మన’ జీవితానికి ‘జడ్జిమెంట్’ ఇస్తూనే ఉంటుంది!**

✦ మీ దృష్టిలో ఓడిపోవటం అంటే ఏమిటి?

**'గెలవక పోవటం' కాదు...!**
**నిరాశతో ఆగి పోవటం...**
**ప్రయత్నం నుంచి తప్పుకోవటం...**
**ప్రయాణం ఆపేయటం...**
**'విధి'గా విరమించటం!**



✦ పాలిటిక్స్‌లో చేరే ఆలోచన?


**'ఆలోచన' అనేది పాలిటిక్స్‌లో పచ్చి బూతు! ఆలోచిస్తే చేరలేం... ఆలోచనలుంటే పనికి రాం...! అందుకే ఉన్న ఆలోచనలన్నీ ఆవిరైపోయాక ఆలోచిస్తా... సారీ... దూకేస్తా!**






✦ కమెడియన్స్ డ్రామా, పేతోస్ బాగా చేస్తారు. కానీ కారెక్టర్ నటులు కామెడీ చేయలేరు. కామెంట్ ప్లీజ్.

**తనలో(పలి)ని తడిని పసిగట్టగలిగిన వాడు కమెడియన్... నవ్విస్తూ, కన్నీరెట్టించగలడు! బయటి వెలుగు నీడల్ని చిత్రిక పట్టినవాడు క్యారెక్టర్ ఆర్టిస్టు... నవ్వించలేడు, నవ్వుకుంటాడు!!**





✦ మీరు ఈర్ష్య పడే కమెడియన్ ఎవరు?

**కమెడియన్‌లంటే ఈర్ష్య పడే రకం కాదు నేను... నా ఈర్ష్యంతా 'హీరో'లంటేనే!!**

✦ బెస్ట్ కమెడియన్ అవ్వాలంటే ఏముండాలి?

**'బెస్ట్' అవటం అంటూ ఉండదు... 'టాప్' అవ్వొచ్చు! టాప్ అవాలంటే ఎవరైనా 'టాప్' డైరెక్టర్(కి) బెస్ట్ 'ఫ్రెండ్' అయి ఉండాలి!**





✦ కామెడీ కి ఫార్సుకి తేడా ఏమిటి?

**లాజిక్ లేకుండా తీసిన కామెడీ... 'ఫార్సై' నవ్విస్తుంది!... లాజిక్‌తో తీయాలనుకున్న 'ఫార్స్' 'కేమిడీ'గా మిగిలి నవ్వుల పాలవుతుంది!**

✦ 'నేను ఇంతకంటే బాగా చేసుంటే బావుండేది' అని ఏ సినిమాలోనైనా అనిపించిందా?


**నాకు అలా అనిపిస్తేనే జర్నీ 'పికప్' అవుతుంది! డైరెక్టర్‌కి అలా అనిపిస్తే కెరీర్ 'పేకప్' అవుతుంది!!**



✦ మీ రెమ్యునరేషన్ రోజుకెంత? హీరో అయితే ఎంత?

**నేను 'గంటల్లో' తీసుకుంటా...! హీరో అయితే 'నిమిషాల్లో' ఇస్తారు మీరు... నాకు తెలుసు! ఇంతకీ షెడ్యుల్ ఎప్పట్నుంచి సార్?... షూటింగ్ ఇండియాలోనేనా? ఫారినా??**




వానొచ్చే.. వరదొచ్చే..
డి. శంకర్
ఈ రోడ్లపై "మ్యాన్ హోల్స్" ఎక్కడుంటాయో తెలియదు కదోయ్... అందుకే ఈ ఏర్పాటు...
BUS STOP
హాయ్ ఫ్రెండ్స్.... చూస్తున్నారా మా కారుతో పాటు, పక్కింటోళ్ళ కారు కూడా కొట్టుకుపోతుంది... ఈ వీడియో నచ్చితే లైక్ చేయండి... షేర్ చేయండి....
వర్షంలో నా వెంట్రుకలు తడిస్తే వెంటనే జలుబు చేస్తుందండి....
ఆ పిల్ల చేపలు ఏదో విహారానికి వెళ్తున్నామనుకొని గంతులేస్తున్నాయి.. ఈ మధ్య మేఘాలకు ఫిష్ ఫేవరెట్ అయ్యింది... మనల్ని జనాల మధ్యకు తీసుకెళ్ళి వదలడం... వాళ్ళు కూరలండుకు తినడం.




# కార్టూన్ పోటీ ఫలితాలు



**కార్టూనిస్టు మిత్రులకు ధన్యవాదములు.**

శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక కార్టూన్ల పోటీలో పాల్గొన్న కార్టూనిస్టు మిత్రులకు నా ధన్యవాదములు. విజేతలకు నా అభినందనలు.

ఈసారి పోటీకి మన కార్టూనిస్టులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలకు కొంచెం కష్టమైనప్పటికీ వచ్చిన వాటిలో ఉత్తమమైన కార్టూన్లని ఎంపిక చేయడం జరిగింది.

గత రెండు సంవత్సరాలుగా కరోనా మహమ్మారి వలన బహుమతి ప్రదాన సభ జరపలేకపోయాం.

ఈసారి మిత్రులందరి సహకారంతో సభ నిర్వహణ జరుగుతుంది అని తెలియజేస్తున్నాము.

ఈ సంవత్సరం శ్రీ సోమయాజుల శివరామయ్య హైమవతి స్మారక అవార్డు- ప్రముఖ కార్టూనిస్టు శ్రీభగవాన్ గారికి ఇవ్వడానికి నిశ్చయించాము. ఆయనకు నా అభినందనలు.

ఎంతో పని ఒత్తిడి ఉండి కూడా ఈ పోటీ నిర్వహణ భారం తన భుజస్కంధాల మీద వేసుకుని విజేతలను నిర్ణయించడానికి తోడ్పడిన మిత్రుడు బాచి గారికి, అలాగే హాస్యానందం రాము గారికి ప్రముఖ కార్టూనిస్టు శ్రీ కామేష్ గారికి మనఃపూర్వక ధన్యవాదాలు. విజేతలకు అభినందనలు

**-ఎస్.వి.రమణ.రిటైర్డ్ ఇంజనీర్, హైదరాబాద్**

**మొదటి బహుమతి రూ.2,500/-లు పొందిన కార్టూన్**




**రెండవ బహుమతి రూ.1,500/-లు పొందిన కార్టూన్**






**మూడవ బహుమతి రూ.1000/-లు పొందిన కార్టూన్**





## జ్యూరీ బహుమతులు పొందిన కార్టూన్లు...ఒకో కార్టూన్‌కి రూ.500/-లు నగదు బహుమతి








హాస్యానందం సౌజన్యంతో నిర్వహించిన– బాచి పురస్కారం, సోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక పురస్కారం, కార్టూన్ పోటీలు– ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీబాచిగారు, ఎమ్.వి. రమణగారు నిర్వహించారు. ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీ కామేష్‌గారు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

పోటీలో పాల్గొన్న కార్టూనిస్టులందరికీ అభినందనలు.

విజేతలకు శుభాకాంక్షలు.

కార్టూనిస్టులను ప్రోత్సహిస్తూ నిర్వహిస్తున్న పోటీ నిర్వాహకు లకు నా హృదయ పూర్వక అభినందనలు. –ఎడిటర్

### శ్రీసోమయాజుల శివరామయ్య, హైమవతి స్మారక అవార్డు-2022 గ్రహీత- ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీభగవాన్ .



సుమారు 45 ఏళ్ళ నుండి కార్టూన్లు వేస్తున్న భగవాన్ పూర్తి పేరు కొవ్వూరి భగవాన్ రెడ్డి. 1980లో ఆంధ్రజ్యోతిలో మొదటి కార్టూన్ అచ్చయ్యింది. ఇప్పటిదాక ఆరువేల కార్టూన్లు వివిధ పత్రికలో ప్రచురించబడింది.

# బంధుత్వాలు... బంధాలే... బలం!

– డాక్టర్ కె.వి.రమణాచారి



బంధాలు బంధుత్వాలు కుచించుకు పోతున్నాయని, నిజానికి బంధాలు ఆత్మవిశ్వాసాన్ని ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె. వి. రమణాచారి తెలిపారు.

బంధం అనే హృదయాంతర అంతర్గత భావన ప్రతి ఒక్కరిలోను వుండాల్సిన అవసరం ఉందన్నారు.

ది. 18, జులై, సోమవారంనాడు డా॥కె.వి. రమణాచారిగారి క్యాంపు కార్యాలయంలో జి.వి.ఆర్.ఆరాధన ఆధ్వర్యవంలో శ్రీ ఎం.బాల గంగాధరయ్య రచించిన **'బంధుత్వాలు–బంధాలు'** కవితా సంపుటి ఆవిష్కరణ ఆత్మీయంగా జరిగింది.

ముఖ్య అతిధిగా విచ్చేసిన డాక్టర్ కె. వి. రమణాచారి ఈ గ్రంధాన్ని ఆవిష్కరించారు. జి. వి.ఆర్.ఆరాధన వ్యవస్థాపకులు గుదిబండి వెంకటరెడ్డి, కళా పోషకులు వి.వి.రాఘవ రెడ్డిలకు ఈ కవితా సంపుటిని అంకితం ఇచ్చి సంప్రదాయంగా సత్కరించారు.

'ఇటీవల కాలంలో బంధాలు బంధుత్వాలు కనుమరుగవుతున్నాయని, బాంధవ్యాలను కాపాడుకోవడమే భారతీయ ఘనమైన సంస్కృతీ అని, బంధాలే మనిషికి బలం అని డాక్టర్ కె.వి. రమణాచారి తెలిపారు.

కళ పత్రిక సంపాదకులు డాక్టర్ మహ్మద్ రఫీ మాట్లాడుతూ– 'బంధుత్వాలకు బంధాలకు స్నేహానికి అత్యంత ప్రాధాన్యమిచ్చే వారిరువురికి కృతి అంకితం చేయడం సముచితం స్ఫూర్తిదాయకం' అని అభినందించారు.

సాహితి కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు అధ్యక్షత వహించిన ఈ సభలో కవయిత్రి పొత్తూరి జయలక్ష్మి పుస్తక సమీక్ష చేశారు.

కవి ఎం. బాల గంగాధరయ్య మాట్లాడుతూ ఈ తరానికి బంధుత్వాల బాధ్యతను గుర్తు చేసేందుకు ఈ సంపుటిని ప్రచురించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా డాక్టర్ కె.వి.రమణాచారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆనంద నిలయం వృద్ధాశ్రమానికి గుదిబండి వెంకటరెడ్డి 50 వేల రూపాయల విరాళం అందించారు.

ఆర్టిస్ట్ ఛయనిక ప్రభాకర్ గీసిన పోర్ట్రైట్ చిత్రాన్ని జి.వెంకటరెడ్డిగారికి డాక్టర్ కె.వి.రమణాచారి బహూకరించారు.

# 'నేను కాలాన్ని' కవిత సంపుటి ఆవిష్కరణ



మానస ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యవంలో ప్రముఖ కవి, రచయిత **శ్రీ శిష్టి శేషగిరి** రచించిన **'నేను కాలాన్ని'** కవితా సంపుటి ఆవిష్కరణ జూలై 15న హైదరాబాద్, కళాసుబ్బారావు కళా వేదికలో జరిగింది.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥కె.వి.రమణాచారి గారు ముఖ్య అతిధిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు.

శ్రీ బైస దేవదాసు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో త్యాగరాజగాన సభ అధ్యక్షులు శ్రీ కళా జనార్ధన మూర్తి, శ్రీ పొత్తూరి సుబ్బారావు, శ్రీమతి లలితావాణి, మానస ఆర్ట్ థియేటర్ అధ్యక్షులు శ్రీ బండారుపల్లి రామచంద్రరావు, కన్వీనర్ శ్రీమతి కోక భవాని, కార్యదర్శి శ్రీ రఘుశ్రీ, అశోక చక్రవర్తి తదాతరులు పాల్గొన్నారు.

# నేములో నేముంది

బుద్ధవరపు కామేశ్వరరావు,
98480 47322

**పెంటేష్, పైడుష్క దంపతులకు పెళ్ళైన ఆరు సంవత్సరాల తర్వాత పుట్టిన అమ్మాయికి ఆ రోజు నామకరణం వేడుక జరుగుతోంది.**

**బంధుమిత్రుల తాకిడితో ఇల్లంతా కోలాహలంగా ఉంది.**

**"ఇదిగో పెంటబాబూ... ముహూర్తానికి ఇంకో గంట టైముంది. పిల్లకి ఏం పేరు పెట్టాలో నిశ్చయించుకొన్నారా నాయనా?" అడిగారు బక్కపంతులుగారు.**

"ఒక్క పది నిమిషాలు గురువు గారూ... ఒకసారి అందరినీ అడిగి ఫైనల్ చేసేస్తాం!" పంతులు గారికి చెప్పి, ఏవో సాంప్రదాయాలు పేరిట పెద్దలు తమకు పెట్టిన పెంటయ్య, పైడమ్మ పేర్లలాంటి పేర్లు కాకుండా తమ బిడ్డకు ఓ మంచి వెరైటీ పేరు పెట్టాలని మనసులో అనుకుంటూ, బంధువులను తీసుకుని తమ గదిలోకి వెళ్లారు పెంటేష్, పైడుష్క దంపతులు ఉరఫ్ పెంటయ్య, పైడమ్మ.

✦✦✦

గదిలోకి వెళ్లి, తాము పెట్టదలచుకున్న పేరు ఏమిటో చెబుదామని నోరు తెరవబోతున్న పెంటేష్‌తో... "ఒరే, తమ్ముడూ! ఇంకా ఏ పేరు నిర్ణయం కాకపోతే... ఆడపిల్ల కాబట్టి నాన్న పేరు మాధవరావు కలిసొచ్చేలా 'మాధవి' అని పెట్టరా!" ఉచితంగా ఓ బోడి సలహా పడేసాడు బోడి బుర్ర గోక్కుంటూ పెద్దన్నయ్య.

"అలా కాదు కానీ... నేను చెబుతున్నా విను! అమ్మపేరు ఇంతవరకు ఎవరికీ పెట్టలేదు కాబట్టి 'రుక్మిణి' అని పెట్టు! ఇంకేం మాట్లాడకు!" హూంకరిస్తూ చెప్పింది ఫైర్ బ్రాండ్ పెద్దక్క.

"ఒరే తమ్ముడూ! ఇలాగే అందరూ తలో పేరు, నీ తలలో ఎన్ని పేలు ఉన్నాయో అన్ని పేర్లు చెపుతారు కానీ, నా మాట విని, పిల్ల 'టిమ్స్' హాస్పిటల్‌లో పుట్టింది కాబట్టి ఆ పేరే పెట్టేయ్!" ఎర్ర తువ్వాలు భుజం మీద సవరించుకుటూ చెప్పాడు వామపక్ష భావాలు మెండుగా ఉన్న చిన్న అన్నయ్య.

"తమ్ముడూ! రాత్రి ఓ రెండు మూడు సార్లు పాము నా కలలోకి వచ్చిందిరా!...ఎందుకైనా మంచిది ఆ పేరు కలిసేలా 'నాగలక్ష్మి' అని పెట్టుకుంటే బావుంటుందేమో ఆలోచించు!..." పొడవాటి జడను పాములా ఆడిస్తూ చెప్పింది చిన్నక్క.

"మీరు ఏం పీక్కుంటారో పీక్కోండి! సారీ! ఏం పేరు పెట్టుకుంటారో పెట్టుకోండి, కానీ మా అమ్మ పేరు 'నర్మద' కూడా కలపండి!" పైకి పిడుగులు కురిపిస్తూ, లోలోపల ఉడికిపోతూ చెప్పింది... పైడుష్క, పెంటేష్ భార్య, పిల్ల తల్లి!

"బావగారూ, నాదో సలహా ! మీరు ఉద్యోగం చేస్తున్నది వన సంరక్షణ డిపార్టుమెంటులో కాబట్టి , ఆ పేరు కలిసేలా 'వనజ' అని పెట్టండి. భేషుగ్గా ఉంటుంది!" కొబ్బరి చెట్టులా అటూఇటూ ఊగుతూ చెప్పాడు, తాటిచెట్టులా ఎదిగిన బావమరిది.

"ఒరే అబ్బాయ్! నా పేరు పెట్టకపోయినా పరవాలేదు కానీ, నా మాట విని పిల్లకి 'త్రివేణి' అని పేరు పెట్టారా! ఎందుకంటే కిందటేడాది అలహాబాద్ వెళ్లినపుడు ఆ త్రివేణి సంగమంలో స్నానం చేస్తూ త్వరలోనే మీకు సంతానం కలిగేలా అనుగ్రహించాలని మొక్కుకున్నాను!" ముక్కు చీదుతూ చెప్పింది తల్లి రుక్మిణి.

"ఒరే పెంటాయ్!... పిల్ల జాతకం చూసా. పిల్లది అగస్త్య ముని నక్షత్రం... అందువల్ల ఆయన భార్య 'లోపాముద్ర' పేరు పిల్లకు పెట్టుకుంటే... జాతకంలో ఏమైనా లోపాలుంటే పోతాయి!" ఉచిత సలహా పడేసాడు జాతకాలు మీద బతికే మేనమామ.

"ఈ గొడవంతా ఎందుకు కానీ, వసంత ఋతువులో పుట్టింది కాబట్టి 'వసంత' అని పెట్టేయ్! ఏ గొడవ ఉండదు!!" నేనెందుకు తగ్గాలనట్టు తను కూడా ఓ పేరు తగిలించింది మేనత్త సుతిమెత్తగా.



ఈలోగా, బయటనుండి పంతులు గారు– "ఏమ్రా! పైడీ పెంటలూ, పిల్లకి పేరు పెట్టడానికి ఇన్ని రోజులా? మీ వాటం చూస్తే, మీరు బయటికి వచ్చే సమయానికి పిల్లకి పెళ్లివయసు వచ్చేలా ఉంది!" ఆరు ఊర్లకి వినిపెంచేటంత గట్టిగా అరిచారు పంతులు గారు.


"హమ్మయ్య! బక్కగా ఉన్నా, చక్కగా టైంకి ఆదుకున్నారు, లేకపోతే ఇంకా ఎన్ని పేర్లు వినాల్సివచ్చేదో" అని అనుకుంటూ , హీటెక్కిన బుర్రతో గదిలోంచి బయటపడ్డాడు పెంటేష్.

✦✦✦

"పంతులుగారూ! ఆ చీటీలో ఏం పేరు రాసాడో, గట్టిగా చదివి వినిపించండి" కోరస్ గా అరిచారందరూ.

చీటీ చదివిన పంతులు గారి మొహం, డెంగ్యూ, బ్రెయిన్ ఫీవర్, చికెన్ గున్యా ఒకేసారి తగులుకున్న వాడిలా వాడి పోయి వేలాడిపోయింది.

"చూడు నాయనా ఏం పేరు పెట్టావో చెప్పి పుణ్యం కట్టుకో నాయనా!... అలా చూడు నాయనా, పాపం పంతులు గారి మొహం ఎలా పీక్కు పోయిందో? ఇంకా ఆయన్ని హింస పెట్టడం సబబు కాదు! ఆ పేరేదో నువ్వే చెప్పి తగలడు! టెన్షన్‌తో పోయేలా ఉన్నా నాయనా!" గుమ్మడి తరహాలో పెద్దన్నయ్య వేడికోలు.



"అయితే, నేనే చెబుతున్నా జాగ్రత్తగా వినండి. మా అమ్మాయి పేరు... 'మారుటినా నవత్రిలోవ' పిల్ల పేరు చల్లగా చెప్పాడు పెంటేష్.

"శభాష్! శభాష్!! భలే పేరు పెట్టి నా పేరు నిలబెట్టేవురా తమ్ముడూ!" అంటూ కళ్లు, పళ్లు బయటకి తన్నుకొచ్చేలా మొహం పెట్టి, ఎర్ర తువ్వాలుని గట్టిగా దులిపి భుజం మీద వేసుకొని చెప్పాడు చిన్న అన్నయ్య.

"ఏడిసావులే ఎర్రిసచ్చినోడా! అయినా అదేం పేరురా? ఇంకేమీ పేర్లు లేనట్లు?... అలా ముంగిలా చూస్తావేం? సమాధానం చెప్పు ముందు!" సూర్యకాంతం లెవెల్లో అరిచింది పెద్దక్క.

"నవత్రిలోవ అని కాకుండా, 'తలుపులమ్మ లోవ' అని పెట్టుకోలేక పోయావా? కొంచెం పుణ్యమయినా వచ్చేది !" ఛాయాదేవి రేంజులో అన్నది చిన్నక్క.

"సైలెన్స్!... కొంచెం సేపు మీరందరూ నిశ్శబ్దంగా ఉంటారా? చూడండి! నేను పెంటేష్‌నే కానీ, మీరు అనుకున్నంత శుంఠేషును మాత్రం కాను. మీరనుకుంటున్నట్టు ఆ మారుటినా నవత్రిలోవ గారు ఎవరో నాకు తెలియదు. ఆవిడ అసలు పేరు అదో కాదో కూడా నాకు తెలియదు. మీ అందరినీ బాధ పెట్టడం ఇష్టంలేకే మీరు చెప్పిన విధంగానే పిల్లకి ఆ పేరు పెట్టా!" వివరణ ఇచ్చాడు పెంటేష్.

"ఎట్టెట్టా! మా మాటకి గౌరవం ఇచ్చి, ఆ పేరు పెట్టావా? ఎంత దొడ్డ మనసురా నీది? ఏది ఆ పేరులో మేము సూచించిన ఒక్క పేరు చూపించు!" రమణారెడ్డి టైపులో మేనమామ.

"అయితే వినండి! మీరు సూచించిన పేర్లు : మాధవి, రుక్మిణి, టిమ్స్, నాగలక్ష్మి, నర్మద, వనజ, త్రివేణి, లోపాముద్ర, వసంత... ఎవరినీ బాధపెట్టడం ఇష్టంలేక, ఆయా పేర్లలో మొదటి అక్షరం తీసుకుని పెడితే వచ్చిన పేరే 'మారుటినా నవత్రిలోవ'. అనుమానం ఉంటే మళ్లీ సరిచూసుకోండి" అంటూ చీటీని వాళ్ల ముందు పెట్టాడు పెంటేష్.

వెంటనే అందరూ పొలో మంటూ ఆ చీటీ మీద పడ్డారు, ఆ నేములో తాము చెప్పిన నేము లోని మొదటి అక్షరం ఉందో లేదో చూసుకోవడానికి.




# శ్రీ అన్నెపు సన్యాసిరావు స్మారక కార్టూన్ పోటీ ఫలితాలు


## న్యాయ నిర్ణేత: హరి వెంకట రమణ (హరి)

**హా**స్యానందం ఆధ్వర్యంలో, మా తండ్రి గారి పేరిట నిర్వహించిన వ్యంగ్య చిత్రాల పోటీలో పాల్గొన్న ఔత్సాహికులు అందరికీ నా అభినందనలు. అలాగే ఈ పోటీని విజయవంతంగా నిర్వహించిన సంపాదకులు శ్రీ రాము గారికి నా కృతజ్ఞతలు. ఈ పోటీకి గాను దాదాపు 100 కార్టూన్లు ఎంట్రీలుగా వచ్చాయి. సమకాలీన అంశాలతో పాటు సామాజిక ఇతివృత్తాలను కూడా స్పృశించారు. తమ కుంచెకు పదును పెట్టారు. తమ భావాలను పంచుకున్నారు. అయినప్పటికీ ఇది పోటీ కాబట్టి, న్యాయనిర్ణేత హరి వెంకట రమణ (హరి)గారు ఈ కార్టూన్‌లోని వివిధ కోణాలను పరిశీలించి విజేతలను ప్రకటించారు. ఈ పోటీ కోసం సమయం వెచ్చించిన ప్రతీ ఒక్క కార్టూనిస్టుకు పేరు పేరునా మా ధన్యవాదాలు మరియు శుభాభినందనలు. **మీ మిత్రుడు - ఎ. జయకుమార్**


### మొదటి బహుమతి రూ.1000/-లు పొందిన కార్టూన్





### రెండవ బహుమతి రూ.800/-లుపొందిన కార్టూన్






### ప్రత్యేక బహుమతులు రూ.300/-లు పొందిన కార్టూన్లు (10)








ఇతనో ఐదెకరాల రైతు... పాపం ప్రకృతి కరుణించక ప్రభుత్వాలు కరుణించక చితికి పోయాడు... 200 కోట్ల బడ్జెట్‌తో ఇతని స్టోరీ మనం తీయబోతున్నాం.. తప్పకుండా మనకు లాభం గ్యారంటీ...!



పెను తుఫాను కారణంగా భారీ వర్షాలు వరదలు! నీట మునిగిన పలు నగరాలు, పల్లెలు! లక్షల హెక్టార్ల పంట వరదపాలు! వరద ధాటికి కొట్టుకుపోయిన పలు రోడ్లు, వంతెనలు! నిరాశ్రయులైన లక్షలాది ప్రజలు!
2022
2122
SARMA


అంతా 'నిజమే' చెప్తాను!!
అదిగో మళ్లీ 'అబద్ధం' చెప్తున్నాడు మి లార్డ్!!


Police Station
pushpa


ఇదిగో! పక్కింటిలో ఉన్న పార్వతత్త ఊరెళ్ళింది. వాళ్ళాయనకి ఆకలేస్తుందేమో నేను వెళ్ళి క్యారేజీ ఇచ్చొస్తా!


XYZ TV
LIVE
రవీ! అక్కడ పరిస్థితి ఎలా ఉంది? చనిపోయిన యువకుడు ఏమంటున్నాడు!!


కోరికలు, మూఢనమ్మకాలు వదల్లేదితను! పైన స్వర్గంలో అప్సరసలు కలుస్తారని, వీటిని కూడా తనతో పాతిపెట్టమన్నాడు..
R.సికరాజు గారు 90 వ ఏట స్వర్గస్తులయ్యారు
వయాగ్రాతో పాటు ఖననం
BURIED WITH VIAGRA TABS
ప్రసిద్ధ


MLA గారి ఇంటికి దారి
మరో 5 సంవత్సరాల వరకు MLA గారు రారు
వనజ

# (వి)చిత్ర విమర్శకుడు

కంచనపల్లి ద్వారకనాథ్,
9985295605

**చిత్రం విచిత్రం సిని న్యూస్ పేపర్ ఆఫీసు బోర్డు చూసి... వికటేశ్వరరావు పిచ్చి ఆనందంతో లోపలకి అడుగు పెడు తుండగా సెక్యూరిటి ఆపి–**

**"ఎవరు కావాలండి?" అనగానే విచిత్రంగా ముఖం పెట్టి చేతిలోని న్యూస్ పేపర్ చూపి... విషయం చెప్పగా లోపలకి పంపాడు.**

దర్జాగా అడుగులేస్తూ లోపలికెళ్ళి కుడివైపున ఉన్న ద్వారానికి చారుకేశ్వరరావు ఎడిటర్ అన్నబోర్డు చూసి... లోపలికి వెళ్ళబోతున్న వికటేశ్వరరావుని అక్కడే ఉన్న ద్వారపాలకుడు ఆపి– "ఎవరు మీరు వచ్చిన పని చెపితే ఎడిటర్ గారికి చెప్పి ఆయన రమ్మంటే పంపిస్తాను!" అన్నాడు .

చేతిలో పేపర్ చూపించి, మిస్టర్ బీన్‌లా ముఖం పెట్టి విషయం చెప్పగా... అక్కడే ఉన్న కుర్చీలో కూర్చోమని చెప్పి... సాలార్జంగ్ మ్యూజియంలో క్లాక్‌లో గంట కొట్టేవాడిలా సర్రున లోపలికి వెళ్ళి ఐదు నిముషాల్లో బయటకు వచ్చి– "ఎడిటర్ సార్ మిమ్మల్ని రమ్మంటు న్నాడు!" అన్నాడు.

ఆ మాట వినగానే ఆనందంతో వికటేశ్వరరావుకి విశ్వనాథ్ గారి స్వాతిముత్యం సినిమాలో కమలహాసన్ సువ్వి సువ్వి పాటకు డాన్స్ వేసినట్లు... వేయాలనిపించి నిగ్రహించుకుని లోపలి అడుగు పెట్టి రాజకీయ నాయకుడిలా నమస్కరించాడు.

"కూర్చోండి!" అని చిరునవ్వు నవ్వి... "మీరు రచయితలు కదా ఎలాంటి రచనలు చేస్తారు?" అని అడిగాడు.

"నేను మీ పత్రికలో చిత్రాలపై విమర్శలు వ్రాసేవారు కావలెను అన్న ప్రకటన చూసి వచ్చాను సార్." అన్నాడు గట్టిగా నవ్వుతూ.

"ఓహో అలాగా! సరే మీరు వ్రాసిన వాటిలో నుండి మీ అను భావాలు చెప్తారా?" అన్నాడు చారుకేశ్వరరావు.

వికటేశ్వరావు వికటాట్టహాసం చేసి... "నా అనుభవంలో ఎన్నోసార్లు ఎన్నో చిత్రాలపై విమర్శలు రాద్దామని కూర్చున్నప్పుడల్లా... రాసేట ప్పుడు ఒక్కొక్క చిత్రంలో ఒక్కొక్క డౌటు వచ్చినప్పుడల్లా కన్ఫ్యూజ్‌తో డౌట్లు క్లియర్ కాక ఆగిపోయిన రచనలు ఎన్నో..." అని నవ్వాడు.

ఎడిటర్‌కి ఏమి అర్థం కాక అయోమయం ముఖం పెట్టి చూస్తూ– "ఇంతకి మీరు ఏం వ్రాసారో కొన్ని అయిన చెప్పండి..."


అనగానే వికటేశ్వరావు– "ఇప్పుడు దారిలోకి వచ్చారు... కొన్ని ఉదాహరణలు చెప్తాను వినండి... బాహుబలి చిత్రం ఎంతో పేరు తెచ్చుకుంది. దాని మీద విమర్శ రాద్దామని కూర్చున్నా... సినిమా అంత అర్థమైంది కానీ... కట్టప్ప మాత్రం ఎందుకు స్వెటర్ వేసు కుంటాడో అర్థం కాలేదు!... ఆ రాజ్యంలో ఆయనకొక్కడికే చలి వేస్తుందా?... అన్న డౌట్ రావడంతో ఆలోచిస్తూ కూర్చున్న..." అని ఇంకేదో చెప్పేలోపల...

"కొంపదీసి రాసారా?" అన్నాడు చారుకేస్వరరావు.

ఆ మాటకు గట్టిగా నవ్వి– "కొంపతీసి ఎందుకు రాస్తాను సార్! పెన్ను క్యాపు తీసి రాస్తాను కాని..." నవ్వ బోతుంటే ఆపి మనసులో ఈ తింగరోడు దొరి కాడు ఏంట్రా బాబు అనుకుని– "ఇంకేమి రాసారో చెప్పండి" అనగానే...

"ఇంకేమి అడగకండి! అన్ని నేనే చెప్పేస్తాను వినండి... టక్ జగదీష్ సినిమా గురించి రాద్దామనుకున్నా... అన్ని సినిమాలలో హీరోలో మాములుగాం ఫైట్ చేస్తారు... కాని ఈ సిని మాలో హీరో టక్ చేసుకుంటే గాని కొట్టడు ఎందుకబ్బ అన్న డౌట్ వచ్చి రాయడం ఆపి ఆ సినిమా డైరెక్టర్ని కలవాలనుకున్నాను కాని తీరికలేక కలవలేకపోయాను." అన్నాడు.

చారుకేశ్వరావు తల పట్టుకొన్నాడు. కళ్ళు రెండు ఆంటీ క్లాక్ డైరెక్షన్లో తిరిగాయి.



అది చూసి– "నేను మీకు చెపుతుంటేనే మీ కళ్ళు అలా తిరిగాయంటే నేను ఎంత విమర్శకుడినో మీకు అర్థమైవుంటుంది. అందుకే ఇంకో విషయం చెప్తా వినండి! ఎఫ్2 సినిమా గురించి వ్రాద్దమనుకున్నా దానిలో మాటకొస్తే 'అంతేగా... అంతేగా' అని రెండుసార్లు అనడం, అందరూ మళ్ళీ మళ్ళీ అంతేగా అని ఎందుకు అంటారు అన్న డౌటు వచ్చి ..." అని చెప్పే లోపల...

"ఆఁ! ఆఁ!... అర్థమైంది దాన్ని వ్రాయలేదు కదా?" అన్నాడు.

"భలే పాయింట్ క్యాచ్ చేసారు సార్! మీరు భలే బ్రిలియంట్!" అని ఇంకోటి చెప్పి తీరాలి సార్ ..." అంటుండగా...

"వికటేశ్వరావు గారు ఇంక చాలు ... అర్థమైంది ... పోకిరి, కెజిఎఫ్, అఖండ, పుష్ప... గురించి రాసారా?" అని కోపాన్ని అనుచుకొని అడిగాడు ఎడిటర్.

" భలె వాళ్ళే! రాయడానికి ముందు రాసిన వాటి డౌట్లు తీరాలి కదా? ఎలా రాస్తానను కున్నారు? అందుకే మీ ఆఫీసులో చేరి మిమ్మల్ని అడిగి చిత్ర విమర్శలు వ్రాసేటప్పుడు వచ్చే ఇలాంటి డౌట్లు మీ ద్వారా తెలుసుకుని రాస్తాను సార్!... ఏమంటారు?"అన్నాడు .

వెంటనే చారుకేశ్వరావుకి ఎక్కడో కాలి విపరీతమైన కోపం తన్నుకోస్తుండగా తన కోపమే తన శత్రువు తన శాంతమే తనకు రక్ష అన్న శతక పద్యం గుర్తుకొచ్చి నిగ్ర హించుకుని... సెక్యురిటిని పిలిచి గేంటే యాలని–

"సెక్యురిటి!" అని గావుకేక పెట్టెలోపు సెక్యురిటినే లోపలి వచ్చి–


"సార్! సార్... మన ఆఫీసు బయట అంబులేన్స్ వచ్చింది సార్... ఎవరో ఇద్దరు మిమ్మల్ని అర్జంటుగా కలవాలట!" అనగానే వడి వడిగా బయటికి వచ్చాడు చారుకేశ్వరావు.

అక్కడ ఒక ఆడామే, ఒక మగాయన నిలబడి వున్నారు.

వాళ్ళు ఎడిటర్‌కి నమస్కరించి– "సార్! మీ ఆఫీసుకి వచ్చిన వికటే శ్వరావు మా ఆయన... ఇతను నా తమ్ముడు. మా ఆయనకు సినిమాల గురించి రాయాలన్న పిచ్చి. అది కాస్త ముదిరి పిచ్చి పడితే ఆ పిచ్చి ఆసుపత్రిలో చేర్పించాము. అది బాగా అయ్యింది. కాని డాక్టర్ గారు ఆయనకి గతం గుర్తు కొచ్చే విషయాలు గుర్తు చేయవద్దు. అలాచేస్తే మళ్ళీ పిచ్చి పట్ట వచ్చు అని చెప్పారు... కాని అనుకోకుండా మా ఇంటికి నా తమ్ముడు వచ్చి కుశల ప్రశ్నలు వేస్తూ సినిమాలు గురించి ఏవో అడుగగా ఈయన పరిస్థితి మొద టికి వచ్చింది... ఇంతలో మీ పేపర్ ప్రకటన చూసి మీ దగ్గరకి వచ్చా డని తెలిసి..." అంటుండగా లోపల నుండి వికటేశ్వరావు బయటికి వచ్చి–

"సార్ మీరు ఎక్కడికో వెళ్లి పోయరో అను కున్న... అరె! మా ఆవిడ గుడా వచ్చింది. ఇక నాకు ఉద్యోగం వచ్చింది అన్న శుభ వార్త చెప్పాల్సిందే..." అంటుండగా అంబు లెన్స్ నుండి ఇద్దరు బాయ్స్ వచ్చి వికటే శ్వరావుని అంబులెన్స్ లోకి ఎక్కించి పట్టు కెళ్ళు తుండగా చారుకేశ్వరరావుకి అతనుపెట్టె కేకలు వింటూ లోపలి వెళుతూ...

'బతికానురా బాబు!... లేకుంటే నేను వాడితో పాటు అంబులెన్స్ ఎక్కాల్సి వచ్చేది అని కుర్చీలో చతికిలబడ్డాడు చారుకేశ్వరావు.



# నెల నెలా నవ్వుల వెన్నెల




**ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు** కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు ప్రతి నెలా **ఒక అంశం** మీద హాస్యానందంలో వేసే కార్టూన్ల సమాహారం.

## ఈ నెల అంశం- వర్షం ది రెయిన్!






















ఈ రోజుల్లో పాలల్లో ప్రత్యేకించి కలపనక్కర్లేదే! పాల కేన్ కి
మూత పెట్టకుండా ఇలానే ఒదిలేస్తే సరి!


ఇన్నాళ్ళగుర్తొచ్చానా వానా... ఎన్నాళ్ళని
దాక్కుంటావే పైనా... ఈ పాట నచ్చినట్టయితే
ఒకటి నొక్కండే...


SARMA


ఈ వర్షాలకు రోడ్డుమీద మాన్‌హోల్స్
ఎక్కడ తెరుచుకోనుంటాయో మీకు
తెలియదురా.. జాగ్రత్తగా చూ......


ఏదీవాన!
మే నెల
ఏందీవాన!!
జూలై నెల


మా పెరట్లో ఉన్న మొక్కల
కోసం మా ఆయన క్లౌడ్ బరస్ట్ చేసి
వర్షం కురిపిస్తున్నారు వదినా!

# సండే స్కీం

డాక్టర్ పార్థసారథి చిరువోలు,
99088 92065

**"త్వరగా లేచి తయారవ్వు. పిల్లలను కూడా గబగబా సిద్ధం చెయ్యి. ఈ రోజు మనం చాలా దూరం వెళ్లాలి" తొందరపెట్ట సాగాడు భజగోవిందం.**

**ఆండాళ్లకు చికాకేసింది.**

**"ప్రతిరోజూ తెల్లవారక ముందే లేవటం, రోజంతా ఇంటి చాకిరీ ఎలాగూ తప్పదు. కనీసం మీకు ఆఫీసు, పిల్లలకు స్కూలు లేని ఆదివారమయినా నాకు విశ్రాంతి దొరుకు తుందంటే..." ఆమె వాక్యం పూర్తి చేయలేదు.**

**భజగోవిందం ఇంతెత్తున లేచాడు.**

"నా సండే స్కీమ్ గురించి కూడా తెలిసి కూడా నువ్వు ఇలా మాట్లాడటం బావోలేదు అండా!"

"ఛీ! ఛీ!! అండా ఏమిటి? అసహ్యంగా... అలా పిలవద్దని ఎన్ని సార్లు చెప్పాలి?" విసుగ్గా అంది.

"అబ్బబ్బ! అసలు విషయం పక్కన పెట్టి ఈ గోల ఏమిటి?" కాస్త స్వరం తగ్గించి అన్నాడు. దాంతో ఆండాళ్లు మెత్తబడింది.


"సర్లే! మీరు చెప్పదలుచుకున్నదేదో చెప్పండి. అవతల సింకు నిండా గిన్నెలు మూలుగుతున్నాయి. వెళ్లి శుభ్రం చేసుకోవాలి!"

"పరమేశం గుర్తున్నాడా?"

"ఆc..."

"ఈ రోజు వాళ్లింటికి వెళుతున్నాం...సండే స్కీంలో ఈ రోజు మజిలీ పరమేశం ఇల్లు!"

"ఆ కొంప ఈ దరిదాపుల్లో లేదు కదండీ... పడుతూ లేస్తూ అంత దూరం వెళ్లటం అవసరమా?" నిట్టూరుస్తూ అడిగింది.



## నవ్వే ఆనందం




"పిచ్చిమొహమా!... అసలు విషయం విను! మొన్నేదో పని కోసం వాడు ఫోన్ చేశాడు... మాటల మధ్యలో ఆదివారం ఎప్పుడయినా ఖాళీ ఉంటే మా ఇంటికి రారాదూ అన్నాడు. నేను ఆ అవకాశం వదులుకుంటానా? ఎప్పటి దాకానో ఎందుకు? వచ్చే వారమే మీ ఇంట్లో అడుగుపెడతా అని మాట ఇచ్చేశాను. రాత్రి కూడా వాడికి ఫోన్లో ఇంకోసారి గుర్తు చేశాను!"

"అలాగా!... మీ ప్రణాళిక భేషుగ్గా ఉంది!"

"అవును మరి! ఈ సిటీలో ఇంటి అద్దెలు... పిల్లల చదువులు, ఇతర ఖర్చులన్నీ భరించటం నాలాంటి మధ్యతరగతి వాడికి సాధ్యమయ్యే పనేనా? అందుకే సండే స్కీమ్‌ను కనిపెట్టాను. ప్రతి ఆదివారం ఏదో ఒక స్నేహితుడు లేదా... బంధువు ఇల్లు వెతుక్కుని వెళ్లటం... భోజన వేళ కంటే చాలా ముందుగానే ఇంట్లో ఉంటాం కాబట్టి, తిండిపెట్టరన్న సమస్య లేదు. నేను ఎంపిక చేసుకునే వాళ్లంతా నాన్‌వెజ్‌గాళ్లే! మాంసాహారం తినే అవకాశం చిక్కుతుంది!" లొట్టలేసుకుంటూ చెప్పాడు భజగోవిందం.

"హాయిగా ఇంటిపట్టునే ఉండి ఉన్నదేదో తిని విశ్రాంతి తీసుకోక ఈ స్కీముల గోలతో విసిగెత్తటంలా?"

"వారంలో ఆరు రోజులు ఏం తింటున్నాం, చారు, పచ్చడి మెతుకులేగా, కనీసం వారంలో ఒక్క రోజయినా ఇలా రుచికరమైన భోజనం చేయకపోతే... మనం బతికేదెలా?... పిల్లల పరిస్థితి ఏమిటి? ఒకసారి ఆలోచించు!"

"మరి వెళ్లిరావటానికి మనకయ్యే ఖర్చుల మాటేమిటి?" అడిగింది ఆండాళ్లు.

"మనకి దక్కేదానితో పోలిస్తే, మన ఖర్చు నామమాత్రమే... చిల్లర విసిరి నోట్లు ఏరుకోవటం లాంటి పని చేస్తున్నాను. ఆరు వారాలు విజయవంతంగా లాగించాం!" అన్నాడు భజగోవిందం.


"ఫోన్ చేయకుండా హఠాత్తుగా వెళ్లే వాళ్లం కదా? ఈ సారేమయింది. ముందుగా అన్నీ సిద్ధం చేసుకుని బయలుదేరుతున్నారు?" మళ్లీ అడిగింది ఆండాళ్లు.

"అవును! అదృష్ట దేవత తలుపు తడితే... అన్నీ ఇలాగే కలిసొస్తాయి. మనం వెళ్లే సరికి పంచభక్ష్య పరమాన్నాలు, నాన్ వెజ్ ఐటమ్స్ అన్నీ రెడీగా ఉంటాయి... పద! పద!!" నోట్లో నీళ్లు ఊరుతూండగా చెప్పాడు భజగోవిందం.

పరమేశం ఇల్లు సిటీకి దాదాపు నలభై కిలోమీటర్ల దూరంలో ఉందన్న విషయం ఆండాళ్లకు గుర్తొచ్చింది.

గబుక్కున మంచం మీద నుంచి లేచి జెట్ స్పీడులా పనులు కానిచ్చింది.

పిల్లల్ని కూడా తయారు చేసి నలుగురూ బయటపడేసరికి రెండు గంటలపైనే సమయం పట్టింది. కొద్ది దూరం మెట్రోలోనూ... మరి కొంతదూరం ఆటోలోనో ప్రయాణించి ఆపసో



పాలు పడుతూ ఎలాగయితేనేం పరమేశం ఇల్లు చేరుకున్నారు.

స్నేహితుని కుటుంబం వాళ్లని ఆప్యాయంగా స్వాగతించారు. అతిథి మర్యాదలతో గౌరవించారు.

సాయంత్రం వరకూ సరదాగా కాలం గడిచిపోయింది... పిల్లలు బాగా ఆడుకున్నారు. వాళ్లకసలు సమయమే తెలియలేదు. బయలు దేరే ముందు విసుక్కుంది గానీ, ఆండాళ్లకు కూడా అక్కడ వాతావరణం బాగా నచ్చింది. ఇక భజగోవిందం అయితే చెప్పక్కర్లేదు... పొట్టలో ఏ మాత్రం ఖాళీ లేకుండా భోజన పదార్థాలతో నింపేశాడు. వాళ్ల ఇంటి నుంచి తిరిగొచ్చే ముందు పరమేశం భార్య క్యారేజీలో కాసిని స్వీట్లు, ఇతర పదార్థాలు కూడా ఇచ్చి రాత్రి భోజనం కోసం కూడా వెతుక్కునే పరిస్థితి లేకుండా చేసింది.

ఆ రాత్రి ప్రశాంతంగా నిద్రపోయాడు భజగోవిందం.

✦✦✦

"ఎవరో తలుపు కొడుతున్నారు చూడండి!" భార్య పిలుపుతో లేచాడు భజగోవిందం.

గబుక్కున వెళ్లి తలుపు తీసి చూశాడు.

ఎదురుగా తన పినతల్లి కొడుకు ప్రసాద్ తన భార్య, పిల్లలతో.

ఆ నలుగురిని చూడగానే భజగోవిందానికి ఒళ్లు మండింది.

'ఆదివారం తెల్లవారక ముందే తగలడ్డారు.




ఇదేదో అపశకునంలా ఉంది...' తన సండే స్కీమును దెబ్బతీయటానికి వచ్చిన దుర్మార్గులుగా వారిని భావించాడు.

మనసులో బండబూతులు తిట్టుకున్నాడు. బలవంతంగా పెదాల మీదకు నవ్వు తెచ్చుకున్నాడు... అప్పుడే లోపల నుంచి వచ్చిన ఆండాళ్లు, ప్రసాద్ భార్య చేతిలో ఉన్న పిల్లాడిని అందుకుని వాళ్లను లోపలకు ఆహ్వానించింది.

కాఫీలు, టిఫిన్లు పూర్తయ్యాయి. ప్రసాద్ భార్య మంచి మాటకారి. తనేదో గలాగలా మాట్లాడుతూనే ఉంది... ఆండాళ్లు ఉత్తమ శ్రోతగా మారిపోయింది.

పిల్లలను సముదాయించే పనిలో ప్రసాద్ మునిగిపోయాడు.

భజగోవిందానికి ముళ్ల మీద కూర్చున్నట్టుగా ఉంది. 'ఇప్పుడు వచ్చిన వాళ్లకు భోజన ఏర్పాట్లు చేయాలి ఎలా?' అన్న ఆలోచనలో మునిగిపోయాడు.

'భజగోవిందం ప్రణాళికలు వేయటంలో దిట్ట. ఆ మధ్య ఎవరో స్నేహితుడు ఫోన్ చేసి, కాంపిటీటివ్ పరీక్ష రాయించటానికి అమ్మాయిని తీసుకొస్తా... నాలుగు రోజులు ఉండి వెళతానంటే, 'అరె! మేం ఊళ్లో ఉండటం లేదు. అదే టైంకి నేను కరీంనగర్ క్యాంపుకు వెళుతున్నాను. ఎలాగూ వెళుతున్నా కదా అని ఫ్యామిలీని కూడా వెంటబెట్టుకుని పోతున్నా!" అని అప్పటికప్పుడే అతికినట్టు అబద్ధం చెప్పేశాడు.


'ఇప్పుడు వచ్చిన వాళ్లకు భోజన ఏర్పాట్లు చేయాలి ఎలా?' అన్న ఆలోచనలో భజగోవిందం ఉండగానే...

అనుకోని సంఘటన సంభవించింది.


అతని ఆఫీసులోనే పని చేస్తున్న శీను కుటుంబం హఠాత్తుగా ప్రత్యక్షమైంది.

"గోవిందం! ఇటువైపు పనుండి వచ్చాం! మళ్లీ ఇంత దూరం రాలేం కదా?... అందుకే మిమ్మల్ని కూడా చూసి పోదాం... అనుకుని వచ్చాం!" అన్నాడు.

భజగోవిందం కుటుంబంతో సహా వాళ్లింటికి వెళ్లినప్పుడు దాదాపుగా ఇవే మాటలు చెప్పాడు... ఉదయం టిఫిన్ దగ్గర నుంచి, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్






అయ్యే వరకూ వాళ్ల ఇల్లు వదిలి రాలేదన్న విషయం గుర్తుకొచ్చింది.

గొంతులో పచ్చి వెలక్కాయ పడింది.

అక్కడే ఉన్న తన కజిన్‌ను పరిచయం చేశాడు భజగోవిందం.

అందరూ కబుర్లలో పడ్డారు. మాటల్లో శీను అన్నాడు–


"వంట చేయించి చెల్లెమ్మను ఏం బాధపెడతావు?... హాయిగా ఏ రెస్టారెంట్‌కో తీసికెళ్లు! బావార్చి వాళ్ల కొత్త బ్రాంచి కొత్తగా ఇక్కడ ప్రారంభించారు... ట్రై చేస్తే బావుంటుందేమో!" అని ప్రతిపాదించాడు.

ప్రసాద్ కూడా అదే మంచిది అని మద్దతు పలికాడు.

భార్య వంక దీనంగా చూశాడు... భజగోవిందం... ఆమె బీరువాలో బట్టల మడత కింద ఎప్పటి నుంచో మూలుగుతున్న క్రెడిట్ కార్డు తెచ్చి అతని చేతిలో ఉంచింది.

అందరూ కలిసి ఆటోల్లో రెస్టారెంట్ దగ్గరకు వచ్చారు. రోడ్డు దాటి రెస్టారెంట్‌లోకి అడుగు పెడుతున్న సమయంలో... మరో సంఘటన చోటుచేసుకుంది.

అటుగా స్కూటర్ పైన వెళుతున్న కొలీగ్ శ్యామల, భార్యాభర్తలిద్దరూ కనిపించారు...




వాళ్లను చూడగానే శీను ఆపి పలకరించాడు.

"మన భజగోవిందం ట్రీట్ ఇస్తున్నాడు. మీరిద్దరూ కూడా జాయినైతే బావుంటుంది." అన్నాడు.

భజగోవిందం పళ్లికిలించక తప్పలేదు.

ఒకరి వెనగ్గా మరొకరు రెస్టారెంటులోకి ప్రవేశించారు.

అందరికీ ఒకేచోట టేబుళ్లు దొరకలేదు. కుటుంబాలవారీగా ఎక్కడికక్కడ సర్దుకున్నారు. ఆ తర్వాత పిల్లా, పెద్ద ఎవరికి కావలసింది వారు ఆర్డరిచ్చారు. భజగోవిందానికి ముద్ద గొంతు దిగటం లేదు.

అతని ఇబ్బందిని ఆండాళ్లు గమనిస్తూనే ఉంది.... ఎవరు ఏం తిన్నారో, ఏ కూల్ డ్రింకులు తాగారో? లెక్కలేదు. తృప్తిగా తేన్చి విందు ఇచ్చిన భజగోవిందాన్ని అభినందించి అటు నుంచి అటే వెళ్లిపోయారు.

హోటల్ వాళ్లిచ్చిన బిల్లు చూసిన భజగోవిందం కొన్ని నెలల పాటు ఆ భయంకరమైన అనుభవం నుంచి తేరుకోలేదు.

ఎంతగా అంటే, విజయవంతమైన తన సండే స్కీం మరిచిపోయేటంతగా.

ఇప్పుడు ఆండాళ్లకు ఆదివారం వీలయినంత విశ్రాంతి దొరుకుతోంది.

బారెడు పొద్దాక లేచాక వంటావార్పు చేసుకుంటూ కాలక్షేపం చేస్తోంది.




**గతంలో...** అమెరికాలో స్థిరపడ్డా బ్రహ్మచారి చందు. అందరికీలానే చందు పెళ్ళికోసం తండ్రి తన మరదలు సుబ్బలక్ష్మిని పెళ్ళి చేసుకోమని నెత్తినోరు కొట్టుకుని మొత్తుకుంటుంటాడు. తనకి మరదలు మీద ఏ ఫీలింగ్ లేదని చందు తెగించి చెప్పేస్తాడు. మూడు నెలల్లో యోగ్యురాలైన అమ్మాయిని తెచ్చి మా ముందు పెట్టు... లేదంటే చచ్చిపోతానని బెదిరిస్తూ తండ్రి ఈమెయిల్ పంపిస్తాడు. అమ్మాయిని వెతికే పనిలో ఉంటాడు చందు. మెక్సికన్ కిడ్నాపర్ ఓలేకి, సుబ్బు ఒక ఫోటో ఇచ్చి, ఆ అమ్మాయిని కిడ్నాప్ చేయమని చెప్తాడు. ఆ అమ్మాయి తెలంగాణ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో 6వ అయిటమ్ చేసే అమ్మాయని చెప్తాడు. ఆ కార్యక్రమం అయిపోయాక సౌమ్యను కిడ్నాప్ చేసి, ఒక గదిలో బంధిస్తాడు ఓలే!.... సౌమ్య ఓలేని నానా విధాలుగా ఇబ్బంది పెడుతుంటుంది. ఆమె పెట్టే ఇబ్బందులు భరించలేక ఆమెని విడుదల చేస్తాడు ఓలె. ఇందు నాన్న తెలంగాణ అబ్బాయికే యిచ్చి ఇందు పెళ్ళి చేయాలనుకుంటుంటాడు. ఆంధ్ర కుర్రాడు చందుని ఇష్ట పడుతుంది ఇందు. అయితే ఇందు నాన్న తెలంగాణ అబ్బాయికే ఇందునిచ్చి పెళ్ళి చేయాలనుకునేందుకు కారణం వంద సంవత్సరాల గతంలోకి వెళ్ళాల్సిందే... అలా వెళ్ళాక... సుబ్బారావు. అప్పన్నలు పోలీస్ ట్రైనింగ్ కోసం హైదరాబాద్ వెళతారు. ఖాళీ టైంలో ఒక గుర్రపు బండిని మాట్లాడి సిటీ చూడ్డానికి బయలుదేరుతారు...

**ఆ తర్వాత.....**

ప్రస్తుతం...

**గోల్కొండ కోటకు కాస్త దూరంలో గుర్రపు బగ్గీలు ఉండే చోట, తన బండిని ఆపాడు బాషా.**

**'ఒరే కాస్త గుగ్గిళ్ళు వేసి చావరా... లాగి లాగి అలసిపోయాను.' అన్నట్లుగా గుర్రం సకిలించింది. అప్పన్న, సుబ్బారావు గుర్రపు బండి దిగారు.**

**బాషా, గుర్రానికి గుగ్గిళ్ళు వేసి, నీటి బకెట్ దాని పక్కన పెట్టాడు.**

**'ఈ బాషా గాడికి నా తెలుగు భాష అర్థం కాకపోయినా, గుర్రాల యాస మాత్రం బానే అర్థం అవుతుంది!' అనుకుంది గుర్రం.**

"షాబ్! నేను ఆ చెట్టు కింద పండుకుంట. మీరు గోల్కొండ ఖిలా సూసి రండ్రి షాబ్. మెయిన్‌గేట్‌ను బాలాహిస్సార్ దర్వాజా అంటారు షాబ్. ఇంకో సైడ్ ఫతే దర్వాజా ఉంటాది. మీరు మర్చిపోకుండా ఈ పేర్లు యాదికి పెట్టుకోండి షాబ్!" అన్నాడు.

ఇద్దరు తలలూపి లోపలికి వెళుతుంటే, అట్లాస్ సైకిల్ వ్యక్తి ఆదరాబాదరగా వచ్చి సైకిల్‌ను ఓ పక్కన ఆపి, వీరిని అనుసరించాడు.

గోల్కొండలో వీళ్ళు ఏ గదిలోకి వెళితే ఆ గదిలోకి తోకలా వస్తున్నాడు ఆ పొట్టి వ్యక్తి.

సుబ్బారావు, అప్పన్న ఓ రాయి మీద కూర్చున్నారు. ఆ వ్యక్తి, కాస్త దూరంలో ఉన్న ఇంకో రాయి మీద కూర్చున్నాడు.

వీళ్ళు లేచి నిల్చుంటే, అతడూ లేస్తున్నాడు. వీళ్ళు వేగంగా నడిస్తే, అతడూ వేగంగా నడుస్తున్నాడు.

"ఇక్కడ ఇంత నిర్మానుష్యంగా ఉంది, ఎవరైనా

పొడిచి పారేసినా దిక్కులేదు!" అన్నాడు సుబ్బారావు.

"మరే, ఇక్కడ సెక్యూరిటీ మరీ ఇంత తక్కువగా ఉండడం ఏంటో?" అన్నాడు అప్పన్న.

"మన దగ్గరున్న డబ్బులు ఎవరైన ఎత్తుకుపోతే?" అన్నాడు సుబ్బారావు.

"మనమే పోలీసులం. మన డబ్బు ఎవడు ఎత్తుకుపోతాడు. కుళ్ళబొడిచి, కాళ్లూ చేతులు విరిచి పొయ్యిలో పెట్టి... బొబ్బట్లు వండి మరీ తింటాం!" అన్నాడు అప్పన్న.

ఇది విని... పొట్టి వ్యక్తి భయంగా కాస్త దూరం జరిగి... చెవులు మాత్రం వీరి మీదే పెట్టి మరీ వినసాగాడు.

అప్పన్న, సుబ్బారావు మెట్లు ఎక్కి... కోట మీదికి వెళ్ళారు. చుట్టుపక్కల ఉన్న పొలాలు, మైదానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

పొట్టి వ్యక్తి బల్లిలా మెట్ల మీద పాకుతూ... ఓ పక్కన దాక్కొని మరీ వీరి సంభాషణ వినసాగాడు.

"నిజాం రాజు, బ్రిటీష్ వారికి ఎంత కప్పం కడతాడో?" అన్నాడు అప్పన్న.

"అదేంటి? హైదరాబాద్ స్టేట్ స్వతంత్ర్య రాజ్యం కదా?" అన్నాడు సుబ్బారావు.

"కానీ ఎంతో కప్పం కడతాడు అని ఓ దిన పత్రికలో చదివినట్లు గుర్తు. లేకపోతే బ్రిటీష్ వారు అంత ఈజీగా ఎందుకు ఊరుకుంటారు?" అన్నాడు అప్పన్న.

అప్పన్న, సుబ్బారావు... వీడి సంగతేంటో కాస్త చూద్దామా... అన్నట్లు కళ్లతోనే సైగ చేసుకున్నారు.

"అరే భాయ్! హిక్కడ కోటలో జైలు హెక్కడ ఉంది?" అన్నాడు సుబ్బారావు.

"ముజే నహి మాలుం!"అన్నాడు పొట్టి వ్యక్తి.

"అరే భాయ్! శ్రీరామదాసును గొలుసులతో కట్టేసి, ఈ కోటలోనే హెక్కడో జైల్లో వేసారంట కదా... అది హెక్కడ?" అన్నాడు సుబ్బారావు.


"ముఝే నహీ మాలుం!" అన్నాడు పొట్టి వ్యక్తి.


"అరే భాయ్! ఈ గోల్కొండ హెప్పుడు కట్టించిండ్రు?"

"ముఝే నహీ మాలుం!"

"ఈ గోల్కొండ ఎత్తు... అదే హైట్ ఎంత?"

"అరే! అవన్నీ నాకు తెల్వద్!..." అనేసి గబగబా ఆ పొట్టి అక్కడి నుండి వెళ్ళబోయాడు.






“అరే పొట్టి భాయ్! నీకు ఏమీ తెల్వకుండా హైదరబాద్‌లో ఎందుకు ఉన్నావ్?... అదే మా విజయనగరం రా! మా కోటల పుట్టుపూర్వోత్త రాలు, చరిత్ర అంతా చెబుతాం!...” అన్నాడు అప్పన్న.

ఆ పొట్టి వ్యక్తి చురచురా చూస్తూ అక్కడి నుండి వెళ్ళిపోయాడు.


ఈ లోపు ఏదో అలికిడి, కేకలు లీలగా వినిపిస్తుండడంతో... సుబ్బారావు, అప్పన్న చప్పున ఆ శబ్దం వస్తున్న వైపు తిరిగారు.

గోల్కొండ కోట కింద... ఒక గుర్రం అడ్డ దిడ్డంగా పరుగులు పెడుతోంది.

ఆ గుర్రం పై ఖరీదైన దుస్తులలో ఓ పదేళ్ళ పిల్లవాడు, ఓ పదమూడేళ్ల పిల్లవాడు... కూర్చొని ఉన్నారు. పిల్లలు పెద్దపెట్టున కేకలు పెడుతున్నారు.

సుబ్బన్న, అప్పన్న గబగబా ఇంకో వైపు నుండి మెట్లు దిగి, గోడ మీది నుండి పాకుతూ వేగంగా కింది వచ్చారు. ఈ లోపు ఇద్దరు నిజాం సైనికులు... ఆ గుర్రం వెంట పరుగెత్త సాగారు. బుర్ఖా ధరించిన ఉన్న ఇద్దరు మహి ళలు ఉర్దూలో ఏవో అంటూ హాహాకారాలు చేస్తూ... ఆ పిల్లలున్న గుర్రం వైపు చేతులు చూపుతూ అరుస్తున్నారు.

సుబ్బారావు పరుగెత్తుతూ– “నేను గుర్రాన్ని తీసుకొస్తా...” అన్నాడు అప్పన్నతో.




అప్పన్న తలూపి, వింటి నుండి వదిలిన బాణంలా ఆ పిల్లలున్న గుర్రం వైపు పరుగెత్త సాగాడు. ఈ లోపు, సుబ్బారావు గుర్రపు బగ్గీని ఎక్కి, గుర్రాన్ని అదిలించాడు.

పిల్లలు ఉన్న గుర్రం వైపు దూసుకొచ్చిన అప్పన్న, ఒక్క ఉదుటున గుర్రం పైకి ఎక్కి, దాన్ని కంట్రోల్ చేయాలని ప్రయత్నించాడు, కానీ దాన్ని ఆపడం సాధ్యపడలేదు.

సైనికులు పరుగెత్తలేక అలసిపోయి కింద కూలబడ్డారు.

అలాగే అప్పన్న గుర్రాన్ని ఆపలేక, పిల్లలతో సహా ముందుకు దూసుకెళ్లిపోతున్నాడు.

ఈలోపు, షార్ట్ కట్‌లో గుర్రపు బగ్గీతో సహా వచ్చిన సుబ్బారావు, అప్పన్న ఉన్న గుర్రానికి సమాంతరంగా వస్తూ– “అప్పన్న! పిల్లలను విసిరేయండి. పట్టుకుంటాను!” అని అరిచాడు.

భయంతో కేకలు వేస్తున్న, ఆ పిల్లలను ఒక్కొక్కరిగా సుబ్బారావు వైపు విసిరాడు. సుబ్బారావు చాకచక్యంగా ఆ పిల్లలను పట్టుకొని బగ్గీలో కూర్చోపెట్టాడు.

ఈలోపు, అప్పన్న సరిగ్గా ఒక మర్రి చెట్టు రాగానే, ఎగిరి ఆ చెట్టు ఊడలు పట్టుకున్నాడు. గుర్రం ముందు పరుగెత్తి, అడవిలోకి పారి పోయింది.

ఈ లోపు, సుబ్బారావు బగ్గీని మర్రిచెట్టు వద్దకు తీసుకొచ్చాడు. అప్పన్న గుర్రపు బగ్గీ లోకి ఎక్కాక, బగ్గీని వెనక్కి తిప్పి తీసుకొచ్చి,

ఆ ముస్లీం మహిళల దగ్గర ఆపాడు.

అందులో ఒక మహిళ, పిల్లలిద్దరినీ దగ్గరకు హత్తుకొని మరీ ఏడవసాగింది.

పరుగులు పెట్టి అలసిపోయిన నిజాం రాజు సైనికులు అక్కడికొచ్చారు.

"షాబ్! మా తలకాయలు కాపాడారు!" అన్నాడొక సైనికుడు మెచ్చుకోలుగా.

సుబ్బారావు, అప్పన్న ఆయాసం తీర్చు కుంటూనే చిరునవ్వులు నవ్వారు.

"ఆప్ కౌన్ హై?" అడిగింది ఆ పిల్లల తల్లి.

"మై సుబ్బారావు!... ఏ అప్పన్న నాయుడు. హం ఆంధ్రా సే ఆయా హై. పోలీస్ ట్రైనింగ్ క్యాంప్ కోసం హై!" అన్నాడు సుబ్బారావు.

ఆ మహిళ, సుబ్బారావు, ఇద్దరు ఉర్దూలో మాట్లాడుకున్నారు.


పక్కనే ఉన్న సైనికులు, ఇంకో మహిళ, అప్పన్న వింటున్నారు.

సుబ్బారావు సంతోషంగా తలూపాడు.

దగ్గరలో ఆగి ఉన్న ఒక ఖరీదైన కారులో ఆ మహిళలు,పిల్లలు వెళ్ళిపోయారు.

"ఏంటటా?" అన్నాడు అప్పన్న.

"మన పంట పండింది అప్పన్న... ఆమె ఎవరో కాదు. నేను చార్మినార్ గాజుల బజార్లో చెప్పానే..ఉజ్బెకిస్తాన్ నుండి వచ్చిన నిజాం బంధువులు అని. వారిలో ఈమె కూడా ఉంది. ఆమె పిల్లలతో, గోల్కొండకు షికారుకు తన చెలికత్తెను తోడు తీసుకొని వచ్చింది. మనం ఆ పిల్లలను కాపాడాం కదా!... అందుకే, కృతజ్ఞతగా మన ఇద్దరిని ఈ రోజు రాత్రి జరగబోయే నిజాంరాజుగారి విందు భోజనానికి అతిధులుగా ఆహ్వానించింది. ఆమె భర్తకు, బంధువులకు మనల్ని పరిచయం చేసి, మన సాహసం గురించి వారికి చెప్తుందట!..." అన్నాడు సుబ్బారావు.




"ఎవరో 56 వజ్రాలున్న హారం వేసుకుంది అని చెప్పారు మీరు. ఆమే గురించి అడక్క పోయారా?" అన్నాడు అప్పన్న.

"ఛ! ఛ...అలా ఎలా అడుగుతామండీ... బాగోదు... నిజాంరాజు బంధువులైన స్త్రీల గురించి మనం వాకబు చేస్తున్నాం... అని తెలిస్తే కష్టాలలో ఇరుక్కుంటాం."

"నా ఉద్దేశ్యం అది కాదండీ... ఆమెను చంపడానికి ఎవరో ప్రయత్నిస్తున్నారు... అన్నారు కదా మీరు. ఆ ముక్క చెప్పి, వారిని అలర్ట్‌గా ఉండమని చెప్పడం కోసమైనా చెప్పాల్సింది!" అన్నాడు అప్పన్న.

"నాకొచ్చిన ఉర్దూయే అంతంత మాత్రం. ఎందుకొచ్చిన గొడవ అని ఊరుకున్నాను. ఈ రోజు రాత్రి విందు భోజనానికి వెళతాం కదా! అక్కడ చెప్పడానికి ప్రయత్నిస్తాను. ఈలోపు, ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో రిహార్సల్ చేసు కుంటాను!" అన్నాడు సుబ్బారావు.

ఈ లోపు, పొట్టి వ్యక్తి వీరి వైపు వస్తూ కనిపించాడు.

మళ్ళీ ఇద్దరూ కన్నుగీటుకున్నారు.

అప్పన, ఆ వ్యక్తి దగ్గరకు వెళ్ళి–

"నేను నిన్ను చంపేస్తాను!" అన్నాడు.

"క్యా?!"అన్నాడా పొట్టి వ్యక్తి భయంగా.

"మొత్తం వినవోయ్! నేను నిన్ను చంపేస్తాను. అని ఉర్దూలో చెప్పాలంటే, ఏమని చెప్పాలి?" అన్నాడు అప్పన్న.


"ముఝె నహీ మాలుం!" అన్నాడా పొట్టి వ్యక్తి.

"ఎవరో ఆమెను చంపేస్తారు... అని ఉర్దూలో అనాలి అంటే, ఏమనాలి?" అన్నాడు అప్పన్న.

"ముఝె నహీ మాలుం హై!" అన్నాడు కోపంగా చూస్తూ. **(సశేషం)**



# స్ఫూర్తి దాయకం పండరి జీవితం



తెలుగు కార్టూనిస్టులకు గర్వకారణం కుమారి రాగతి పండరి! పురుషులు రాజ్యమేలుతున్న కార్టూన్ రంగంలో తనదైన ముద్రతో అద్భుతమైన కార్టూన్లు గీసి ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్న ఏకైక మహిళా కార్టూనిస్టు కుమారి రాగతి పండరి!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎనిమిదవ తరగతి తెలుగు వాచకంలో తొలి తెలుగు మహిళా కార్టూనిస్ట్ కుమారి రాగతి పండరి జీవిత విశేషాలను పాఠంగా ప్రచురించడం కార్టూన్ ఇష్టులందరూ గర్వించదగ్గ విషయం.

రాగతి పండరి చిన్న వయసులోనే పోలియో వ్యాధికి గురై శారీరక లోపం ఏర్పడినా, అక్క రమ సహకారంతో ఇంట్లోనే ఉండి చదువుకున్నారు. వ్యంగ్య చిత్రకళపై తనకున్న ఆసక్తితో కార్టూన్ రంగంలోకి అడుగు పెట్టి... సీనియర్ కార్టూనిస్ట్ డాక్టర్ జయదేవ్ బాబు గారి సలహాలు తీసుకుంటూ, కార్టూన్ రంగంలో తనకంటూ ఓ స్థానం ఏర్పరచుకున్నారు.

ఎనిమిదేళ్ల వయసులో వీరు గీసిన తొలి కార్టూన్ ప్రచురించబడింది.

1970–80 దశకంలో వీరి కార్టూన్లు ప్రచురింపని పత్రిక లేదంటే అతిశయోక్తి కాదు. అన్ని సబ్జెక్టుల మీద ఆమె కార్టూన్లు గీసి పాఠకులను మెప్పించారు. ఆమె కార్టూన్ల నిండా తెలుగుదనమే. కార్టూన్ వ్యాఖ్యకు సరితూగేలా పాత్రలు యాక్షన్‌తో సమతూకం కలిగి ఉండేవి.

హాస్యం,వ్యంగ్యం కలగలిసి ఉండే ఆమె కార్టూన్లు కడుపుబ్బ నవ్విస్తాయి.

కవి చమత్కారాలు, రాజకీయ చదరంగం వంటి శీర్షికలు ఆమెకు ఎంతో పేరు తెచ్చి పెట్టాయి. ఉగాది, దీపావళి, సంక్రాంతి ప్రత్యేక సంచికల కోసం సంపాదకులు ఆమె కార్టూన్లను ముందుగా తెప్పించుకుని ప్రచురించేవారంటే ఆమె కార్టూన్లకు పత్రికలు ఎంత ప్రాముఖ్యత ఇచ్చేవో అర్థమవుతుంది.

అభిరుచి,పట్టుదల, ధైర్యం ఉంటే అభివృద్ధికి అంగవైకల్యం అడ్డు కాదని తన వేలాది కార్టూన్ల ద్వారా నిరూపించిన గొప్ప వనిత రాగతి పండరి.

'నవ్వుల విందు కార్టూన్ల పసందు', 'నా గురించి నేను' (ఆత్మకథ) పుస్తకాలను ప్రచురించారు. కార్టూన్ రంగానికి ఆమె చేసిన విశేష సేవకు గుర్తింపుగా **'ఉగాది', 'కళారత్న' పురస్కారాలు** లభించాయి.


19.2.2015న 50 ఏళ్ల వయసులో ఊపిరితిత్తుల వ్యాధితో అర్థాంతరంగా కన్ను మూశారు. మరణానంతరం అవయవ దానం చేయాలని ముందే నిర్ణయించుకున్న గొప్ప మహిళా కార్టునిస్టు కుమారి రాగతి పండరి. స్ఫూర్తిని కలిగించే ఈమె పరిచయాన్ని పాఠంగా బోధిస్తే... 'అభిరుచి, పట్టుదల, ధైర్యం ఉంటే ఏదైనా సాధించవచ్చనే ఆమె జీవితం 'ఒక పాఠం' అయి తీరుతుంది!

ప్రతియేడు మే, 20న నిర్వహిస్తున్న తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం సందర్భంగా **'బాపురమణ అకాడమీ'** ఒకమహిళా కార్టూనిస్టుకు 'రాగతిపండరి పురస్కారం' ప్రదానం చేస్తూ, సత్కరిస్తారు.



పండరిగారు కార్టూన్ రంగానికి చేసిన కృషికి కృతజ్ఞతాపూర్వకంగా, ఈ సంవత్సరం బాపుగారి పుట్టిన్రోజు సందర్భంగా **'రాగతి పండరి కార్టూన్లు'** పుస్తకం, కార్టూనిస్ట్ రామకృష్ణ ఫౌండేషన్' తరపున రామకృష్ణగారి కుమార్తె శ్రీమతి సునీలగారి చేయూతతో హాస్యానందం విడుదల చేస్తుంది.

**–డా॥ రావెళ్ళ**


ఆ క్రికెట్ విలేకరి మన జట్టు గెలిచింది అని రాసినట్టున్నాడు! మన వాళ్ళు టాస్ మాత్రమే గెలిచారు, మ్యాచ్ ఓడింది అని కరెక్ట్ చేయండి!
EDITOR • DAILY NEWS
క్రికెట్ ఛాంపియన్ కదా అని ప్రేమించా, కానీ ఈమధ్య అన్నీ డక్ అవుట్లే! ఫామ్లో లేడు అందుకే నా ఉద్దేశ్యం మార్చుకున్నా!
DINESH • CRIKETOR
మీ క్రికెట్ జట్టు స్కోర్ లాగే ఉందండీ.. బాబి గాడి ప్రోగ్రెస్ కార్డు..
... ఆటగాళ్ళంతా బాగానే ప్రాక్టీస్ చేస్తారు, కాపోతే ముందు రోజు ఫామిలీస్ తో షాపింగ్, పార్టీల వల్ల అలసిపోయి గెలవాల్సిన మ్యాచ్లో విఫలమయ్యారు!
CHAIRMAN
CRICKET CONTROL BOARD
తోపల్లి ఆనంద్





ఈ పేజీ మీ కోసమే కావచ్చు!
మీ వ్యక్తిగత
(పుట్టిన్రోజు, వివాహ శుభాకాంక్షలు),
వాణిజ్య ప్రకటనలు హాస్యానందంలో
ప్రకటించుకోండి!
హాయిగా నవ్వుకుంటూ...
ఆనందంగా ఉన్నప్పుడే నవ్వుల మధ్య
మీ ప్రకటన్ని పాఠకులు
ఆహ్లాదంగా ఆస్వాదిస్తారు.
వివరాలకై **9849630637** కి
ఒక్క ఫోన్ చేయండి!

ఇంటిల్లిపాదిని అలరిస్తున్న
ఏకైక తెలుగు హాస్యమాస పత్రిక
హాస్యానందం

Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P













# PRIYANKA PANDA

DESIGNER STUDIO

**MEN**

*Sherawani, suits, blazers, tuxedo, shirts, trousers, kurtas, digital printed t-shirts*

**WOMEN**

*Lehangas, blouses, aari / maggam work, long frocks, wester wear, sarees, shararas, palazzo, culottes*

## Designing & Stitching

Priyanka Panda Designer Studio, Plot No-173, OU Colony, Shaikpet, Manikonda Road, Hyderabad-500 008

Call: +919959222411. email: labelpriyankapanda@gmail.com

Hasyanandam August 2022. RNI No. APTEL 08387/01/1/2003-TC



రండి! దర్శించండి!! తరించండి!!!

# శ్రీ అష్టాదశ శక్తిపీఠ సహిత శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం

కీ॥శే॥ శ్రీ గట్టు రాం రాజేశం గుప్తగారి సత్సంకల్పముతో...

గౌ॥ శ్రీమాన్ కె.వి.రమణాచారి IAS, Retd గారి పర్యవేక్షణలో...

## ఆనంద నిలయం ఆవరణలో
## గ్రా॥ కొండపాక. జి॥ సిద్ధిపేట

అమ్మవారి అనంతరూపాలలో అష్టాదశ శక్తి స్వరూపాలు అత్యంత శక్తివంతమైన రూపాలు. ఒక్కో రూపం ఒక్కోరకంగా ప్రభావవంతమైనది. అమ్మవారి ఆవిర్భావంతో, మన భారతావని పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లుచున్నది. అంతటి గొప్ప మహిమాన్విత శక్తిపీఠ క్షేత్రంగా భారతదేశంలో, మన తెలంగాణ రాష్ట్రంలో సిద్ధిపేట జిల్లాలోని కొండపాక గ్రామంలో ఆగమశాస్త్ర విధానంలో వాస్తురీత్యా చక్కని శిల్పసంపదతో నాణ్యత గల నిర్మాణముతో శ్రీశ్రీశ్రీ పుష్పగిరి పీఠాదీశ్వరుల.... ఆశీరనుగ్రహ నిర్వహణలో త్యాగధనుల విరాళములతో ఒక అద్భుతమైన అష్టాదశ శక్తి క్షేత్రంగా శాస్త్రీయ విధానంగా అతి త్వరలో వైభవోపేతంగా ప్రతిష్ఠింపబడుతున్నదని తెలుపుటకు సంతోషిస్తున్నాం. ఇంకా నిర్మాణంగా నున్న, రాజగోపురం, ధ్యాన మండపం, యజ్ఞశాల, వంటశాల, అర్చకుల గృహసముదాయం, భక్తులకు నివాస వసతి గృహసముదాయం అనేక హంగులతో సొబగులతో నిర్మించుటకు సంకల్పించినాం. ఇంతటి గొప్ప విశిష్ఠత గల వైభవోపేతమైన ఈ శాస్త్రీయ అష్టాదశ శక్తిపీఠ రామలింగేశ్వర స్వామి క్షేత్రానికి భక్తులు, దాతలు యధామతిగా యధారీతిన తమ తమ శక్త్యానుసారంగా తను, మన, ధన, సేవా సహకారాలందించి ఈ పవిత్ర పుణ్యకార్యక్రమంలో యధోచితంగా పాల్గొనగలరని సకల భక్తజనావళిని సాదరపూర్వకంగా ఆశిస్తూ ఆహ్వానిస్తున్నాం.

**ఆలయ ట్రస్టు సభ్యులుగా చేరడానికి రూ.3,00,000 విరాళం అందించి శ్రీ స్వామివారి కృపకు పాత్రులు కండి!**

ట్రస్ట్‌కు ఇచ్చే విరాళాలకు ఇన్‌కంటాక్స్ 80-జి సెక్షన్ ప్రకారం ఆదాయపు పన్ను మినహాయింపు ఉంది.

**Provisional Approval Number AAHTA 8091JF20206**

Ashtadasha Shakthi Peetha Sahitha Ramalingeswara Swamy Charitable Trust,
A/C.No-39153802660, IFSC-SBIN005881, Branch: SBI, ADB, Siddipet

వివరాలకు సంప్రదించండి:

శ్రీ అయిత నాగరాజు-9583599999, శ్రీ పెద్ది వైకుంఠం-9440003943, శ్రీ గట్టు రవీందర్-9848504656